# ఎవర్ని చేసుకోను?

"ఈ లెక్కని నీకు సంబంధం ఎప్పటికి కుదురుతుందమ్మా!" అన్నారు నాన్నగారు. ఈసారి ఆయన కంఠం అంత మార్దవంగా లేదు. కొంత విసుగు ధ్వనించింది.

అక్క పెళ్ళయిపోయిన తరవాత, అత్తయ్య కొడుకు రాజుని నేను చేసుకోనని ఖచ్చితంగా చెప్పిన తరవాత ఎన్నో స ంధాలు వచ్చాయి నాకు. బి.ఎ.లో చేరినప్పటినుంచీ, సంబంధం కుదిరేవరకూ చదువుకుంటుంది లెమ్మన్నట్లుగా నా చదువు సాగనిచ్చారు.

కొత్తల్లో నన్ను చూడటానికి వచ్చిన కొందరు కుర్రాళ్ళని తవ్వమొహం అనీ, కొంగ ముక్కు అనీ, మెల్లకన్ను అనీ, బట్టతల అనీ, బడ్డాఖాన్ అనీ, ఆడంగి అనీ ఏవో వంకలు పెట్టి తప్పించుకున్నాను. అమ్మా నాన్నగారూ కూడా మొదట్లో నవ్వేసి ఊరుకున్నారు నా వ్యాఖ్యానాలు విని. తరవాత కొన్ని సంబంధాలు వస్తే ఎడ్లబేరానికి వచ్చినట్లు ప్రవర్తించారనీ, యూపీయస్సీ ఇంటర్వ్యూ అన్నట్లుగా ప్రశ్నలు వేశారనీ, రసిక గృహానికి వచ్చినట్లు నన్ను పాటలు పాడమన్నారనీ, కట్నం కావాలన్నారనీ..ఇలా రకరకాల కారణాలు చెప్పి నిరాకరించాను నాలుగేళ్ళపాటు.

ఈసారి వచ్చిన సంబంధం నాన్నగారికీ అమ్మకీ అన్ని విధాలా నచ్చింది. కుర్రవాడు ఒడ్డూ పొడుగ్గా ఉన్నాడు. స్మార్ట్‌గా ఉన్నాడు. మంచి కుటుంబంలో పుట్టాడు. కట్నం కానుక లడగటం లేదు. ఎటొచ్చీ అతను చేస్తున్న ఉద్యోగమే నాకు అదోలా అనిపించింది. అతను ఏదో మెడికల్ కంపెనీకి సేల్స్ రిప్రజెంటెటివ్‌ట. మా ఇంట్లో కూర్చున్నంత సేపూ తన మందుల కంపెనీ అధిక్యత గురించి మాట్లాడుతూనే ఉన్నాడు. ఏ రోగాలు వచ్చినా అందుకు తగిన మందులు వాళ్ళ కంపెనీ తయారు చేస్తోందనీ, ఈసారి మా కందరికీ రోగాలొస్తే ఆ మందులే వాడాలనీ-ఈ ధోరణిలో సాగిందతని సంభాషణ. వాతావరణమంతా రోగభూయిష్టమయినట్లూ, అతని ప్రపంచమంతా మందుల

మయమైనట్లు అనిపించింది. మాట్లాడుతున్నంత సేపూ అతను మందుల మరాఠీలా కనిపించాడు.

"అతని ఉద్యోగం నాకు నచ్చలేదు" అన్నాను నాన్నగారితో. ఆయనకి విసుగొచ్చింది.

"ఏమిటమ్మా, ప్రతిసారీ ఏదో ఒక వంక పెడుతుంటావ్! ఈ లెక్కని నీకు సంబంధం ఎప్పటికి కుదురుతుందమ్మా? నేను రిటైరై పోయే రోజులు దగ్గరకొస్తున్నాయి. రిటైరైతే మనమొహం చూసేవాడుండడు. బొత్తిగా బాధ్యత తెలుసుకోకపోతే ఎలా?" అన్నారు.

"ఇష్టంలేని సంబంధం ఎలా ఒప్పుకోనండీ?" అన్నాను నాన్నగారి దగ్గర చనువుకొద్దీ.

"పోనీ, నీకెలాంటి సంబంధం ఇష్టమో చెప్పు. నీకు వరుడిలో కావలసిన లక్షణాలన్నీ చెప్పు. పేపరులో ఎడ్వర్‌టైజ్ చేయిస్తాను. నీ కల నిజమౌతుందేమో?" అన్నారు సగం పరిహాసంగా, సగం గంభీరంగా.

అప్పటికి నేనేమీ సమాధానం చెప్పకుండా అక్కణ్ణించి మౌనంగా తప్పుకున్నాను. ఆ రాత్రి చాలా సేపటిదాకా నిద్రపట్టలేదు. ఆలోచిస్తూ పడుకున్నాను. నాకెలాంటి వరుడు కావాలి? వెంటనే నాకు తోచలేదు. ఆ ధోరణిలో నేనింతకు ముందెప్పుడూ ఆలోచించలేదు. ఎలాంటివాడు నచ్చుడో కూడా ఇదమిత్థంగా నిర్ణయించుకోలేకపోయాను. శాల్తీ ఎదురుపడేదాకా నచ్చేదీ లేనిదీ తేల్చి చెప్పలేకపోతున్నాను. ఈ పద్ధతి ఇక లాభం లేదు. వరనిర్ణయంలో కొన్ని నిశ్చితాభిప్రాయాలు ఏర్పరచుకోవటం అవసరం. ఎటువంటివాణ్ణి చేసుకుంటే నాజీవితం సుఖప్రదం అవుతుంది అని నేను ముందుగ్గానే తేల్చుకోవాలి. దాంపత్యజీవితం సుఖప్రదం కావాలంటే జీవిత భాగస్వామికి ఉండవలసిన లక్షణాలేమిటి? అందమా, గుణమా, వంశమర్యాదా, డబ్బా, చదువా, ఉద్యోగమా–అన్నీనా, అందులో కొన్ని మాత్రమేనా, అయితే ఏవేవి?

అందం – అందం కొరుక్కుతింటామా అంటారు పెద్దవాళ్ళు. నిజమే కొంత వరకు. అందంగా లేనంత మాత్రాన మనిషిని కొట్టిపారేస్తామా? అందంగా ఉన్నవాళ్ళు ఎంతమంది ఉన్నారు కనక ఈ ప్రపంచంలో? చూసేవాళ్ళ అభిరుచిని బట్టి కూడా ఉంటుంది అందం అనేది.

గుణం – గుణం మంచిదవునో కాదో ముందుగానే ఎలా తెలుస్తుంది? మరీ వెకిలిగానో క్రూరంగానో కనిపిస్తే తప్ప, గుంభనంగా కూర్చుని వెళ్ళినవాడి గురించి వెంటనే ఏం తెలుస్తుంది? రెండు మూడు సార్లు మాట్లాడినంతలో తెలుస్తుందా?

డబ్బు – డబ్బు లేకుండా గడవటం కష్టమే గాని, కేవలం డబ్బున్నవాడు కదా అని ఏ చవటనో కట్టుకోలేం కదా!

చదువు – అఫ్‌కోర్స్ చదువుండి తీరాలి. ఈ రోజుల్లో ఆడవాళ్ళే చదువుతూంటే మగవాళ్ళకి పెద్ద చదువు ఉండొద్దూ? నాకన్న ఎక్కువ చదువుకున్నవాడై ఉండాలి కదా. ఎంత సమానంగా హక్కులు కావాలని పోరాడినా ఎందుకో భర్త నాకన్న ఉన్నతస్థితిలో ఉండాలనే భావన వదలటం లేదు నన్ను. నా క్లాస్‌మేట్స్‌ని చూస్తే నా ముందు కుర్రకుంకల్లా కనిపిస్తారు. ప్రేమించి పెళ్ళిచేసుకునేట్లుగా అనిపించదు నాకు. నా లెక్చరర్స్‌లో ఎవరినన్నా ఎంచుకుందామా అంటే అందులో కొంతమంది పెళ్ళయినవాళ్ళూ, కొంతమంది మరో కులం వాళ్ళూ. నేనెరుగున్నవాళ్ళలో తగినవాడుగా ఎవరూ నా కింతవరకు కనిపించలేదు.

ఎటువంటి ఉద్యోగం చేసేవాణ్ణి చేసుకుంటే జీవితం సుఖప్రదం అవుతుంది?

నాన్నగారు మెటియొరలాజికల్ డిపార్ట్‌మెంటులో పనిచేస్తున్నారు. అమ్మ ఎప్పుడూ సాధిస్తూనే ఉంటుంది నాన్నగారిని ఆయన ఉద్యోగ నిర్వహణ విషయంలో.

"ఏమండీ. వడియాలు పెట్టాలనుకుంటున్నాను. రేపు ఎండ వస్తుందంటారా?" అని అడుగుతుంది పరమ పతివ్రతలా.

నాన్నగారు "ఓ, నిశ్చింతగా పెట్టుకోవచ్చు. ఫెళ్ళున ఎండ కాస్తుంది" అని వెదర్ రిపోర్టు చెబుతారు.

మర్నాడు పొద్దున్న నాన్నగారు ఆఫీసుకి వెళ్ళేముందు మళ్ళీ అడిగేది. "ఏమండీ, వడియాలు ఎండబెట్టమంటారా?" అని.

"పెట్టవే. నా మాటమీద నమ్మకం లేదేమిటి!" అంటూ వెళ్ళిపోయేవారు.

అమ్మ డాబా మీద చాప వేసి, దుప్పటి పరిచి దాని మీద వడియాలన్నీ పెట్టడం ఇలా పూర్తిచేసేదో లేదో ఆకాశం నలుమూలల నుంచీ మబ్బులు కమ్ముకొచ్చేవి. అప్పుడే పెట్టిన వడియాలతో చాపని నలుగురు మనుషులు మోస్తే గాని వడియాలు ముద్దయిపోకుండా లోపలికి తీసుకురాలేం. అమ్మ ఒకర్తీ (మడి మూలాన్ని) ఆ చాపని చూరుకిందకి ఎలాగో లాగేది. అయినా, వర్షం కుండపోతగా మొదలుపెట్టేసరికి వడియాలన్నీ తడిసిపోయేవి. ఆ సాయంకాలం నుంచీ ఇల్లంతా ఊరుపిండి కంపు! నాన్నగారు ఆఫీసు నుంచి తడిసి వచ్చీ రావటంతోనే చండికలా లేచేది అమ్మ.

"ఈ మగవాళ్ళని నమ్మకూడదు. అందులోనూ వాతావరణ సూచన చేసే ఆఫీసువాళ్ళని ఛస్తే నమ్మకూడదు" అనేది.

తెలిసీ గోతిలో పడుతూ ఉంటుంది అమ్మ ఒక్కొక్కప్పుడు. వాతావరణం ఎలా ఉంటుందని నాన్నగారిని అడక్కుండా ఉండలేదు. ఆ తరవాత దెబ్బలాడకుండా ఉండలేదు.

ఓసారి మబ్బులొచ్చే సూచనలు ఏకోశానా లేవని ఖచ్చితంగా చెప్పారు నాన్నగారు. ఆయన మాట నమ్ముకుని కొత్త పట్టుచీర కట్టుకుని ఎవరింటికో చాలా దూరం నడిచివెళ్ళింది పేరంటానికి. తీరా తిరిగి వస్తూంటే వడగళ్ళ వాన. అమ్మ బాగా తడిసిపోయింది. కొత్త పట్టుచీర పాడవటమే కాకుండా, అసలే తనది వాతశరీరం కావటంవల్ల మర్నాటి నుంచీ ఫ్లూ పట్టుకుంది.

ఆ జ్వరంలో అంది-"ఓ స్కూలు మాస్టర్ని చేసుకున్నా సుఖపడి పోదును. ఈయనతో వేగలేకపోతున్నాను" అని.

ఇక అక్కయ్య సంగతి చూస్తే, అది ఎప్పుడొచ్చినా నసుగుతూనే ఉంటుంది మొగుడి ఉద్యోగం గురించి.

"కట్నం తక్కువ అడిగారు కదా అని చూస్తూ చూస్తూ లైబ్రేరియన్ కిచ్చి చేతులు దులుపుకున్నారు! ఆయన కెంతసేపూ రివిజన్ ఆఫ్ పే స్కేల్సూ, ఎకడమిక్ స్టేటసూ, జీతం, హోదా-ఇదే యావ. ఊళ్లో లైబ్రరీల వాళ్ళనందరినీ పోగుచేసి కొంపలో మీటింగులు పెడతారు.

లైబ్రేరియన్ కదా అని లైబ్రరీ కొచ్చే పత్రికలు కొన్ని ఇంటికి పట్టుకురండీ అంటే, రూలు ప్రకారం అలా తేవటానికి వీల్లేదు. కావాలంటే లైబ్రరీ కొచ్చి చదువుకోమంటారు. పెళ్ళాం కోసమైనా పత్రికలు తీసుకురాలేకపోతే ఎందుకొచ్చిన లైబ్రేరియన్ను? విగ్రహపుష్టీ నైవేద్యనష్టీ అన్నట్లు! ఓ పుస్తకాల కొట్టువాణ్ణి చేసుకున్నా ఇంతకన్న సుఖంగా ఉండేదేమో" అంటుంది అక్కయ్య.

అన్నయ్య రిసెర్చిలాబ్స్‌లో సీనియర్ సైంటిస్టు. ఎంతసేపూ రిసెర్చి, ప్రోజక్టు అంటూ ఆ లాబ్స్‌లోనే పొద్దుటినుంచి రాత్రిదాకా గడుపుతాడు గాని వదిన సరదాల గురించి పట్టించుకోడనీ, ఆదివారం పూటకూడా చదువులో మునిగిపోతాడనీ, ఒక్క ముచ్చటా తీర్చడనీ వదిన ముఖం ముడుచుకుంటూ ఉంటుంది. మరీ నిరాశ కలిగినప్పుడు 'ఆయన ఓ గుమాస్తా అయినా బాగుండేది. హాయిగా పార్కులకీ సినిమాలకీ తీసుకువెళ్ళేవారు' అని నిట్టూర్చుతుంది.

మరి ఎలాంటి ఉద్యోగం చేసేవాణ్ణి చేసుకుంటే నా జీవితం సుఖప్రదం అవుతుంది? ఎంతసేపు ఆలోచించినా డాక్టరుని చేసుకోవాలో, ఇంజనీర్ని చేసుకోవాలో, మరే ఉద్యోగస్తుణ్ణి చేసుకోవాలో అర్థంకాలేదు. నాకే తెలియనిది నాన్నగారితో ఏమని చెప్పను?

మర్నాడు పొద్దున్న యూనివర్సిటీకి వెడుతూంటే దారిలో ఒకతను విలేఖరి-మైక్ పట్టుకుని రోడ్డున పోయేవాళ్ళని కొందరిని ఆపుచేసి పెరుగుతున్న ధరలమీద, ఈ

ప్రభుత్వ విధానాలమీదా మీ అభిప్రాయాలేమిటి?' అని అడుగుతున్నాడు. అతని రెండోచేతిలో చిన్న టేప్‌రికార్డరుంది. విద్యార్థిని నని చెప్పి నన్ను కూడా ఆపి నా అభిప్రాయాలడిగాడు. ఏదో తోచినట్లు జవాబు చెప్పాను. ఆ చెబుతున్నప్పుడే నా మనస్సులో మెరుపులా ఒక ఆలోచన వచ్చింది. నేను ఎరుగున్నవాళ్ళ ఇళ్ళకి వెళ్ళి రకరకాల ఉద్యోగాలు చేస్తున్న వాళ్ళ భార్యల్ని తమ భర్తల ఉద్యోగాల మీదా, తాము గడుపుతున్న జీవితాలమీదా అభిప్రాయాలడిగి, వారి అనుభవాలు కొన్ని విన్నమీదట ఎవరి జీవితం సుఖప్రదంగా ఉందని తోస్తే ఆ రకం ఉద్యోగస్తుణ్ణి వివాహం చేసుకుంటే బాగుంటుందని తోచింది. అప్పుడైతే నాన్నగారితో చెప్పొచ్చు-నాకు ఫలానా ఉద్యోగస్తుడు వరుడుగా కావాలి, అతనికి ఫలానా ఫలానా లక్షణాలుండాలి' అని. అన్నిటికన్నా ముఖ్యం ఉద్యోగం కదా!

ఆ ఆలోచన రావటం తడవు ఎక్కడలేని ఉత్సాహం పుట్టుకొచ్చింది. ఆ రోజు లైబ్రరీలో కూర్చుని చదువుకో బుద్ధి కాలేదు. క్లాసు కూడా ఎగ్గొట్టి ఇంటి కొచ్చేశాను.

కాఫీ తాగి, డ్రెస్ మార్చుకుని బయలుదేరాను.

మొట్టమొదట మా అన్నయ్య స్నేహితుడు వేణుమాధవరావు ఇంటికి వెళ్ళాను. అతను ఇంజనీరు. అతని భార్య మా వదినతో చాలా సరదాగా ఉంటుంది. నాకూ కొద్దిగా చనువుంది ఆవిడ దగ్గర.

నన్ను చూడగానే ఎంతో ఆప్యాయంగా పలకరించి వద్దు వద్దంటున్నా మళ్ళీ కాఫీ తాగించింది నా చేత. మొహమాట పడుతూ, నే వెళ్ళిన పని చెప్పాను. ఆవిడ పకపక నవ్వటం మొదలుపెట్టింది. "ఇదో కొత్త రకం స్వయంవరంలా ఉంది" అంది నవ్వు ఆపుకుని.

"ఎవరో ఒకర్ని తొందరపడి పెళ్ళిచేసుకుని జీవితాంతం బాధపడటం నాకు నచ్చదండీ. నాకు నచ్చినవాణ్ణి ఏరి కోరి చేసుకుని నా జీవితం సుఖప్రదం చేసుకోవటంలో తప్పేముంది?" అన్నాను.

"నీ ఆత్మవిశ్వాసాన్ని మెచ్చుకుంటున్నాను. నీ ప్రయత్నం సఫలం కావాలని కోరుకుంటున్నాను. కానీ, ఒక్కటే హెచ్చరిక నాది. నా అనుభవాన్ని గురించి విన్న తరువాత నువ్వేదో నిర్ణయం తీసుకుంటే ఆ బాధ్యత నాది కాదుస్మీ!" అంది ఆవిడ.

"ఆ మాత్రం నాకు తెలియదుటండీ! ఆ విషయమై మీరేమీ భయపడకండి. మీరు నిస్సంశయంగా మీ అనుభవాన్ని చెప్పండి. నేను మరెవ్వరితోనూ చెప్పను. ఇది నా స్వయంనిర్ణయానికి తోడ్పడటం కోసం మాత్రమే" అన్నాను.

"కానీ...." అంది.

"ఏమిటి సందేహిస్తున్నారు?" అన్నాను. ఆవిడ ఇచ్చిన మాటని ఎక్కడ వెనక్కి తీసుకుంటుందో అని భయపడుతూ.

"అది కాదు. ఒక్క ముక్కలో చెప్పాలంటే కష్టం. ఎక్కడ మొదలుపెట్టి ఎక్కడ ఆపాలో కూడా తోచటం లేదు నాకు. పోనీ, ఓ పని చెయ్యరాదూ? రేపొక్కమారు మళ్ళీ రా. అప్పటికి నాకు తోచిన విధంగా కాగితంమీద రాసి ఉంచుతాను. ఎదురుగుండా చెప్పాలంటే మనస్సు విప్పి చెప్పగలుగుతానో లేదో ననిపిస్తోంది" అంది.

"అంతకన్నానాండీ! రేపు మళ్ళీ వస్తాను. మీరు మాత్రం మరిచిపోకూడదు సుమా" అన్నాను కుర్చీలోంచి లేస్తూ.

ఆ మర్నాడు ఇచ్చిన మాట ప్రకారం ఆవిడ రాసిన కాగితాల బొత్తి నాచేతి కిచ్చింది. ఆవిడ ఎదురుగుండా చదవటానికి మనస్కరించక, ఏదో అర్జంటు పని ఉందని చెప్పి, ఆవిడకి థాంక్స్ చెప్పి ఇంటికొచ్చేశాను.

రాత్రి చదవటం మొదలు పెట్టాను ఆవిడ కథ :

## ఇంజనీరుగారి భార్య

శేఖర్ గారింటికి వాళ్ళమ్మాయి పుట్టిన రోజు పండక్కి పిలిస్తే పార్టీకి వెళ్ళాం మేమిద్దరం. తీరా అతిథులందరూ వచ్చాక హఠాత్తుగా దీపాలు పోయాయి. చలికాలం, సాయంకాలం అవటంవల్ల ఇల్లంతా చీకటి అయిపోయింది. అంతా అయ్యో అయ్యో అనుకుంటూంటే మావారు వెంటనే కమీజు చేతులు పైకి మడిచి "ఏదీ, మెయిన్ స్విచ్ ఎక్కడుంది?" అన్నారు. శేఖర్ గారు అగ్గిపుల్ల వెలిగించి దారి చూపించారు. మెయిన్ స్విచ్ పరీక్షించి ఫ్యూజ్ పోయిందని గ్రహించి, "సన్నని వైరేదైనా ఉందా" అని అడిగారు. శేఖర్‌గారు లేదన్నట్లు బుర్ర ఊపారు. అంతలో వాళ్ళ చిన్నమ్మాయి వచ్చి "నాన్నా, నా బొమ్మల సామాన్లో పాత వైరుముక్కలున్నాయి తీసుకురానా" అని అడిగింది. తీసుకురమ్మన్నా రీయన. పది నిముషాల్లో లైట్లు తెప్పించి ఇల్లంతా కళకళ్ళాడేట్లు చేశారు. శేఖర్‌గారూ, భార్యా ఆయనకి చాలా థాంక్స్ చెప్పారు. ఇంజనీరు భార్యనయినందుకు ఆ క్షణంలో గర్వించాను.

మరోసారి ఇంకెవరో స్నేహితులింటికి వెళ్ళేసరికి భార్యాభర్తలిద్దరూ ఏం చెయ్యాలో తోచక ఏకగ్రీవంగా బాధపడుతున్నారు. వంటింట్లో కుళాయి కట్టెయ్యటం చాతకాక ఎన్ని గుడ్డలు కుక్కినా ధార ఆగటం లేదు. వంటిల్లంతా వరదలయేట్లుగా ఉంది. ప్లంబరు ఎక్కడుంటాడో ఆ ఇంటాయనకి తెలియదుట. ఏం చెయ్యాలో తెలియక తంటాలు పడుతున్న సమయంలో ఆపద్బాంధవుడిలా వెళ్ళారీయన సతీసమేతంగా. సంగతి తెలుసుకుని వెంటనే కమీజు చేతులు వెనక్కి మడిచారు. పట్కారు అడిగి తీసుకుని బలమంతా ఉపయోగించి కుళాయి స్క్రూ తెరిచారు. శివుడి తల్లో గంగలా హోరుమంటూ ఎగతన్నింది నీరు.

"వాషరు వదులైపోయింది. ఇంకో వాషరు ఉందా?" అని అడిగారు ఆయన. లేదన్నాడా స్నేహితుడు. "చుట్టుపక్కల దుకాణాలేమీ లేవా?" అని అడిగితే, ఉంది ఒక చిన్న దుకాణం. వెళ్ళి అడిగిచూస్తానుండండి' అని గబగబా పరుగెత్తాడాయన. అయిదు నిముషాల్లో విజయవంతంగా తిరిగి వచ్చాడు-హనుమంతుడు సంజీవిని పర్వతాన్ని పట్టుకొచ్చినట్లు. ఈయన పదినిముషాల్లో పని పూర్తిచేశారు. తుఫాను వెలిసినట్లు ప్రశాంతంగా అయింది వంటిల్లు. ఆయన స్నేహితుడు కరచాలనం చేశాడు సంతోషంతో.

"చూశారా, మా ఆయన ప్రతాపం" అన్నట్లుగా సగర్వంగా చూశాను ఆ స్నేహితుని భార్యవైపు.

అసలు మా పెళ్ళయాక మొదటిరాత్రే ఇంజనీరు అనిపించుకున్నారాయన.

బంధువులంతా మమ్మల్నిద్దర్నీ గదిలోకి పంపించారు. అది పూర్వకాలపు పందిరిమంచం. వంశపారంపర్యంగా అందరికీ దానిమీదే కార్యం జరిగిందని చెప్పి దాన్ని అలాగే వాడుతూ వచ్చారు. తీరా మేమిద్దరం మంచం ఎక్కి ప్రేమ కలాపం సాగించటం మొదలు పెట్టేసరికి భూకంపం వచ్చినట్లు మంచం ఇటూ అటూ ఊగటం మొదలు పెట్టింది. ఈయన వెంటనే మధ్యలో లేచి మంచం అంతా పరీక్షించారు.

"ఏం కాదులెండి, భయపడకండి" అన్నాను.

"ఏమీ కాకపోవటమేం? మంచంపట్టీలు విడిపోయాయంటే నడ్డి విరుగుతుంది మనిద్దరికీ" అన్నారు.

నేను ఏం చెయ్యాలో అర్థంకాక సిగ్గుపడుతూ నిలబడ్డాను.

"వెళ్ళి మేకులూ సుత్తీ తీసుకురా" అన్నారు.

"ఇప్పుడా! ఇంత రాత్రివేళ! ఎక్కడున్నాయో వెతకాలి. అంతా నిద్రపోతూ ఉంటారు" అన్నాను మొహమాటపడుతూ.

"సరే, అయితే, నేలమీద పడుకుందాం పద" అని దుప్పటి లాగి నేలమీద పడేశారు. మంచానికి కట్టిన పువ్వుల తోరణాలు నన్ను వెక్కిరించినట్లయి నాకు కళ్ళనీళ్ళు తిరిగాయి.

"ఉండండి, చూసి తీసుకొస్తాను" అని చెప్పి చప్పుడు చెయ్యకుండా స్టోర్‌రూమ్‌లోకి వెళ్ళి చెత్తసామాను ఉన్న అలమారంతా వెతికి ఎలాగో ఓ అరడజను తుప్పు పడుతున్న మేకులూ, ఒక ఇనుపగూటం పట్టుకొచ్చి ఇచ్చానాయనకి. ఆయన వెంటనే చొక్కా చేతులు వెనక్కి మడిచి మంచానికి నాలుగు వైపులా మేకులు కొట్టడం మొదలు పెట్టారు. ఆ చప్పుడుకి ఇంటిల్లిపాదీ లేస్తారేమో, ఏం జరుగుతోందోనని వచ్చి చూస్తారేమోనని సిగ్గుతో నా ప్రాణం చితికిపోయినట్లయింది. పెళ్ళిపనులు చేసి చేసి అలసటతో ఒళ్లు మరిచి పడుకున్నట్లున్నారు. ఎవ్వరూ లేవలేదు. బ్రతుకు జీవుడా అనుకున్నాను.

కానీ, మర్నాడు పొద్దున్న కాఫీతాగుతూ మా మామయ్య అన్నాడు 'ఏమిటీ అమ్మలూ, రాత్రి చాలా హడావిడి చేసినట్లున్నారు!' అని. ఆయన నాకేసి చూసి కన్ను గీటారు. నేను కాఫీ కప్పులో ముఖం దాచుకున్నాను.

మా అమ్మకి అల్లుళ్ళందరిలోకీ ఈయన అంటే చాలా ఇష్టం. ఏ పండగకో ఇంటి కొచ్చినప్పుడు ఈయన చేత పెరట్లో స్నానాల గది పక్కని వానాకాలంలో పొయ్యి తడిసి పోకుండా గోడవారగా రేకుదింపించుకోవటమో, వంటింట్లో చిన్న సిమెంటు గట్టు కట్టించుకోవటమో ఇలాంటి కట్టుదిట్టాలు చేయించుకునేది. ఇంజనీరు అల్లుడికి ఇష్టమయిన అరిసెలూ, మినపసున్నీ, చక్కిలాలూ అన్నీ ఓపిగ్గా చేసిపెట్టేది. ఆయన ఉన్న నాలుగు రోజులూ. ఆ ఉత్సాహంలో కూతురికి ఏం కావాలో అని కూడా పట్టించుకునేది కాదు.

ఒక్కొక్కప్పుడు నా భర్త ఇంజనీరు అని గర్వించినా, ఇంజనీరు భార్యనని చెప్పుకోవటానికి సిగ్గుపడిన క్షణాలు కూడా లేకపోలేదు. అసలు ఈ మధ్య అటువంటి క్షణాలే ఎక్కువవుతున్నాయి. ఆయన ఇంజనీరింగు బుర్ర రోజు రోజుకీ వేడెక్కి చురుగ్గా పని చెయ్యటం ప్రారంభించింది.

ఎవరింటికైనా వెడితే ఊరికే వాళ్ళింట్లో కాఫీ టిఫినూ తీసుకుని తిరిగి రాబుద్ధి పుట్టదాయనకి, వాళ్ళు ఏమీ అడక్కపోయినా సరే, గదిలో ఇటూ అటూ చురుగ్గాచూసి, ఆగిపోయిన గోడగడియారం లాంటిదేదైనా కంట పడగానే 'ఏమిటండీ, దీన్నిలా వదిలేశారు?' అంటూ వాళ్ళ అభిప్రాయం ఏమిటో తెలుసుకోకుండానే ఆ వస్తువుని తీసి అంతా తెరిచి అరగంటో గంటో తంటాలుపడి ఒక తీరుకి తెచ్చి రుమాలుతో చెమట తుడుచుకునేవారు.

మరీ పాడైపోయిన వస్తువైతే 'ఇంకా ఏం చెడగొడతాడులే దీన్ని – ఏదో ప్రయత్నం చెయ్యనీ' అని నిర్లిప్తంగా ఊరుకునేవారు కొందరు.

ఈ మధ్య పాడైపోయిన వస్తువుల మీదే కాకుండా సరికొత్త వస్తువులమీద కూడా ఈయన దృష్టి పడుతోంది.

ఓరోజు చక్కని బట్టలు కట్టుకుని ఓ స్నేహితుడి ఇంటికి వెళ్ళాం. అతను కొత్తగా కొన్నకారు కాంపౌండులో ఉంది. 'ఏమిటి, కారుకొన్నారేమిటి?' అని కుశలప్రశ్న వేశారీయన. నాగుండె దడదడలాడింది. అనుకున్నంతా అయింది. ఆ స్నేహితుడి చేతిలోంచి తాళంచెవి లాక్కుని అమాంతం కారు స్టార్ట్ చేశారు. ఏమనుకున్నాడో, ఆ స్నేహితుడుకూడా చటుక్కున కారులో దూరాడు. ఆ స్నేహితుడి భార్యా, నేనూ చూస్తూండగానే స్పుట్నిక్‌లా దూసుకుపోయింది కారు. ఓ అరగంట పోయాక తిరిగి వచ్చారు. మధ్యలో ఏమయిందో

తెలియదు. ఈయనబట్టలు కారు మెకానిక్ బట్టల్లా నల్లటిమచ్చలతో, ముఖమంతా జిడ్డుకారుతూ కనిపించారు. నా ప్రాణం గిజగిజ కొట్టుకుంది.

పోనీ, కారు, రేడియో లాంటి తెలిసిన వస్తువులైతే ఫరవాలేదు. అదే కనక, టేపురికార్డరు లాంటి విదేశీ వస్తువేదైనా అయితే ఈయన మరింత ఉత్సాహంగా బాగుచెయ్యటానికి పూనుకుంటుంటే వద్దనలేక ఆ స్నేహితులు బిక్కుబిక్కుమంటూ చూసేవారు ఈయనను.

"వాళ్ళతంటాలేవో వాళ్ళు పడతారు. ఎవడో చేతనయిన మెకానిక్‌ని పిలిపించుకుని బాగుచేయించుకుంటారు. మధ్య మీకెందుకు బాధ" అని నేను చాటుగా విసుక్కునేదాన్ని.

"ఈ మాత్రం దానికి ఇంకెవడో మెకానిక్ ఎందుకు?

ఒకసారి తీసి చూస్తే అదే తెలుస్తుంది"-అంటూ ప్రతి వాళ్ళ వస్తువూ బాగుచేస్తానంటూ పూనుకునేవారు. ఆ స్నేహితుల ముఖాలు చూడగానే నేను గ్రహించేదాన్ని వాళ్ళు లోలోపల ఎంత భయపడుతున్నారో-వస్తువు ఈయన చేతుల్లో పడినందుకు. ఈయనకి ఆ పట్టింపేం లేదు. నిర్భయంగా, నిస్సంకోచంగా నీది, నాది అని సంశయించకుండా ప్రతి వస్తువూ బాగుచెయ్యటానికి కంకణం కట్టుకునేవారు.

ఎవరైనా కొత్తవాచీ కొనుక్కున్నామని అనడం తడవు. ఏదీ చూడనీ, అంటూ అమాంతం ఎదుటి మనిషి చేతినుంచి రిస్టువాచీ లాక్కుని దాన్ని ఇటూ అటూ చూస్తూంటే వాళ్ళ మొహాల్లో నెత్తురు చుక్క ఉండేది కాదు. కొంపతీసి స్క్రూలు విప్పేసి చూస్తారేమోనని. నేను కన్నులతో ఎన్ని సైగలు చేసినా నన్ను అర్థం చేసుకునేవారు కాదు. అడకత్తెరలో పోకచెక్కలా ఉండేది నా పరిస్థితి.

ఇంట్లో చిలక్కి చెప్పినట్లు చెప్పి తీసుకు వెళ్ళేదాన్ని 'మీరు వాళ్లింట్లో ఏదన్నా బాగుచేస్తానంటూ కూర్చున్నా, ఏదన్నా కొత్త వస్తువు తెరిచి పరీక్షిస్తానన్నా నేను మీతో వచ్చేది లేదు,చెయ్యనని ఒట్టెయ్యండి, అని కూడా అనేదాన్ని. ఆయన ఒప్పుకుంటేగా.

"అన్నీ తెలుసుకుని ఉండాలి. అవసరమైతే స్వయంగా సరిచెయ్యటం నేర్చుకోవాలి" అనేవారు.

ఓ రోజు బజార్లో వెడుతున్నాం మేమిద్దరం. దారిలో శర్మగారూ, భార్యా కనిపించారు.

"మీ టి.వి., ఎలా పనిచేస్తోందండీ?" అని అడిగారీయన, వాళ్ళు టి.వి. కొనుక్కుని మూడు నెలలయిందిట.

'ఏమిటోనండీ, వచ్చిన కొత్తలో బాగానే ఉంది. ఈమధ్య వారం రోజుల నుంచీ దాని కడుపులో తిప్పుతున్నట్టుంది. మధ్య మధ్య ఫ్రేము తిరిగిపోతూంటుంది. పిక్చరు మెలికలు తిరుగుతోంది. మొన్ననే కంపెనీ వారికి కంప్లెయిన్ చేశాను' అన్నారాయన.

కులాసాగా ఉన్నారా అని మాట వరసకి అడిగితే వరసగా ఉన్న రోగాలన్నీ ఏకరవు పెట్టినట్లు. "అయ్యో పిచ్చిబ్రాహ్మడా! ఆ సంగతి మా వారితో ఎందుకు చెప్పావయ్యా?" అని మనస్సులోనే జాలి పడ్డాను శర్మగారిని చూసి. శర్మగారి మాటలు వినగానే ఈయన ముఖం పెట్రోమాక్స్ లైటులా వెలిగింది. నిగనిగలాడే మేకపిల్లని చూసిపంజాలు సరిచేసుకుంటున్న పెద్దపులిలా కనిపించారీయన నా కంటికి.

శర్మగారి టి.వి.ని ఈయన కబంధహస్తాల్లోంచి ఎలా తప్పించాలా అని పరి పరి విధాల పోయింది నా మనస్సు. పాతివ్రత్యం మాట మరిచి పోయి శర్మగారి భార్యని చాటుకి పిలిచి 'మా వారిని నమ్మకండి, నమ్మి ఆయన చేతుల్లో మీ టి.వి.ని పెట్టకండి సుమా' అని హితబోధ చేద్దామన్నంత తపన బయలుదేరింది నాలో.

కాని, అంతలోనే మరో గొంతు వినిపించింది నాలో. "పాపం ఆయన్ని ఎందుకలా ఆడిపోసుకుంటావ్! తనకి చాతనయిన విద్యని సద్వినియోగం చేసి నలుగురికీ సాయం చెయ్యటం తప్పా? ఎప్పుడైనా ఎవరి వస్తువైనా పాడు చెయ్యగా చూశావా? చాతనయినంత వరకు బాగు చెయ్యటానికే ప్రయత్నించాడు కదా. ఏదో కొత్త వస్తువుల్ని చూసి కాస్త కుతూహలం కనపరిస్తే అలా గింజుకుంటావేమిటి? నువ్వే ఆయన సామర్థ్యాన్ని అనుమానిస్తే ఇక ఊళ్ళో వాళ్ళు ఆయన్ని ఏం గౌరవిస్తారు? నీ ఇంజనీరు భర్తని చూసి నువ్వు గర్వించాలి గాని సిగ్గుపడటం తగునా?" అని చివాట్లేసింది.

నా అంతరాత్మ చివాట్లేసి నప్పటినుంచీ నాకు ఆయన మీద అభిమానం ఎక్కువైంది.

ఇప్పుడు ఎవరన్నా 'మీ వారికేంపని?' అని అడిగితే తలెత్తుకుని సగర్వంగా చెబుతున్నాను 'ఆయన ఇంజనీరు' అని.

"ఏ ఇంజనీరు? మెకానికలా, ఎలెక్ట్రికలా, సివిలా, కెమికలా, న్యూక్లియరా" అని అడిగితే, "అన్నీనూ" అని మరింత ఠీవిగా సమాధానం చెబుతున్నాను.

●●●

అంతా చదివిన తరువాత నాకు ఇంజనీరు మీద సదభిప్రాయం కలగలేదు. ఆవిడ కాబట్టి ఆ వేణు మాధవరావు లాంటి ఇంజనీరుతో నెట్టుకొస్తోంది. ఇంజనీరు వద్దుబాబూ అనుకున్నాను కానీ అంతలోనే అనుమానం వచ్చింది. అందరు ఇంజనీర్లూ అతనిలాగే ఉంటారా అని. ఉండరని మాత్రం ఎలా చెప్పటం? అన్నం ఉడికిందో లేదో తెలియటానికి ఒక్క మెతుకు ముట్టుకుని చూస్తే చాలదూ అని నాకు నేనే నచ్చజెప్పుకున్నాను. అయినా ఇంతలోకే తొందరపడి నిర్ణయించుకోవటం దేనికి? అన్ని రకాల ఉద్యోగస్తుల్నీ ఒక్కొక్కరి చొప్పున ముందు సర్వేచేసి, ఒక రౌండ్ కొట్టిన తరవాత మళ్ళీ అటునుంచి నరుక్కొస్తేసరి అని సరిపెట్టుకున్నాను.

మా అక్కయ్య అత్తవారి తరఫు బంధువు ఒకాయన ఈ ఊళ్ళోనే ఉన్నాడు. అక్కయ్య పెళ్ళిలో ఆయన్ని అందరూ భయ భక్తులతో చూసి ఆయనకి అడుగులికి మడుగు లొత్తుతున్నట్లుగా ప్రవర్తించారు. ఆయన పోలీసాఫీసరు. మంచి జమా జెట్టీలా ఉంటాడు. ఆయన భార్య ఆయన ముందు పిట్టలా ఉంటుంది. కూజాబిందె పక్కని చెంబులా ఉంటుందావిడ. మర్నాడు ఆ పోలీసాఫీసరు గారింటికి వెళ్ళాను.

అసలు సంగతివిన్నాక ఆవిడ ముందుగా కొంచెం భయపడింది - వాళ్ల ఆయనకి తెలిస్తే ఏమంటాడో అన్నట్లుగా.

"నేను మీ చెల్లెల్లాంటి దాన్ని. మా అక్కయ్యదగ్గరికి వెళ్ళినంత చనువుగా వచ్చాను చూడండి మీ దగ్గరికి. నా దగ్గర మీకు మొహమాటమెందుకండీ? చెప్పరా? ప్లీజ్" అన్నాను. నా మాటలికి ఆవిడ కరిగి పోయి తన గాథ వినిపించటం మొదలు పెట్టింది.

**పోలీసు ఆఫీసరుగారి భార్య**

"ఎన్ని చెప్పినా సరేగాని ఈ పోలీసాఫీసరుతో కాపురం చెయ్యటం కష్టమే బాబూ!

ఆయనతో సరదాగా సినిమాకని బయలుదేరి సవ్యంగా చూసి ఇంటి కొచ్చిన పాపానపోలేదు ఇంత వరకూ. ఆ సినిమా హాలు దగ్గర బ్లాక్‌లో టిక్కెట్లు కొంటున్నట్లు నటించి, వాణ్ణి అమాంతం రెక్కలు విరిచి పట్టుకుని, పోలీసు స్టేషనుకి ఫోన్ చేయించి పోలీసులొచ్చి పట్టుకెళ్ళే దాకా వదలరు. ఈ లోపల న్యూస్‌రీలు అయిపోవటమే కాక అసలు సినిమాలోని రెండు మూడు రీళ్ళు గిరగిరా తిరిగిపోతాయి మేమిద్దరం లోపలికి వెళ్ళేసరికి. ఈయన తెల్లని పేంటూషర్టూ వేసుకుని వెళ్ళేసరికి, పోలీసాఫీసరని తెలియక వల్లో పడుతూంటారు పాపం ఆ దొంగతనంగా టిక్కెట్లమ్మేవాళ్ళు.

సినిమా హాల్స్‌లోనే కాదు బస్సులో వెడుతున్నా, బజార్లో సరదాగా నడిచి వెడుతున్నాసరే, ఆయన కళ్ళెప్పుడూ వెతుకుతున్నట్లుగానే ఉంటాయి. ఎవడో జేబు దొంగ ఆయన చేతికి దొరక్కమానడు.

ఓ సారి ఒక స్కూటర్ వాణ్ణి కిళ్ళీకొట్టువాడు చాకుతో పొడిచెయ్యపోతూంటే ఈయన చూసి అడ్డుకున్నారు. వాడు మరింత కచ్చతో చాకు ఈయన గొంతు దాకా తెచ్చాడు. నేను కెవ్వుమని అరిచాను-ఆ దృశ్యాన్ని చూడలేక. పట్టపగలు నడిరోడ్డుమీద జనమంతా పోగయారే తప్పఒక్కరూ ముందుకి రాలేదు సహాయం చెయ్యటానికి. ఈయన బలంగా ఉంటారు కాబట్టీ, చెయ్యి తిరిగిన మనిషి కాబట్టీ, ఆ కిళ్ళీ కొట్టువాణ్ణి ఒడుపుగా నేలకి పడగొట్టి వాడి చేతిలోంచి చాకు లాక్కుని దూరంగా విసిరేశారు. పోలీసులొచ్చేదాకా వాణ్ణి అలాగే తొక్కిపెట్టి ఉంచారు. ఆ క్షణంలో మా వారంటే ఎక్కడలేని గర్వం ఉప్పొంగింది

నాలో. కానీ,ఎప్పుడూ గుండె బెదురుగానే ఉంటుంది-ఏ క్షణంలో ప్రమాదంలో చిక్కుకుంటారో అని. అంతేకాదు, ఆయనకి అనుక్షణం దొంగల ధ్యాసే.

ఓ రోజు పొద్దున్నే ఆఫీసుకి వెళ్ళబోతూ "ఏయ్, ఇలారా" అని ఒక పొలికేక వేశారు. వంటింట్లో ఆయన కోసం భోజనం సిద్ధం చేస్తున్న నేను ఒక్క పరుగున వెళ్ళాను.

"నా జేబులో పది రూపాయల నోటు ఎవరు తీశారు?" అని నిలదీసినట్లు అడిగారు.

ఆయన మరీ అంత కర్కశంగా అడుగుతూంటే తెల్లబోయి చూశాను నోట మాట రాక. నా మౌనం చూసి మరింత అసహనంగా "నువ్వేనా తీసింది?" అని అరిచారు.

ఆయన ఆ మాటలన్న తీరుకి నాకళ్ళమ్మట నీళ్ళు తిరిగాయి. పెళ్ళయి అప్పటికి పట్టుమని నెలరోజులు కాలేదు. ఎంతెంత మాటలంటున్నారు నన్ను! కోపం, దుఃఖం ఆగక ఒక్కపరుగున వంటింట్లోకి వెళ్ళి పోయాను మారు మాట్లాడకుండా.

ఆయన నావెనకాతలే వచ్చారు.

"ఇంటిదొంగని ఈశ్వరుడైనా పట్టుకోలేడంటారు. నీ మొగుడెవరనుకున్నావ్! పోలీస్ ఇన్‌స్పెక్టర్! ఆ ఈశ్వరుడి బాబు!" అన్నారు.

ఇంక ఆయన ధోరణి సహించలేకపోయాను.

"నేనేం దొంగని కాదు. మీరు బాత్‌రూమ్‌లో ఉండగా పనిమనిషి జీతం ఇమ్మని చంపుకుతింది. మీరు ఇవతలికొచ్చాక చెప్పొచ్చునులే అనుకుని మీ జేబులోంచి తీసిచ్చాను. తరవాత వంట హడావిడిలో మరిచి పోయాను. ఈ మాత్రం దానికే దొంగతనం అంటగట్టాలా!" అని వెక్కివెక్కి ఏడ్చాను.

"ఊరికే నాటకం ఆడాను! నువ్వెలా తీసుకుంటావో చూద్దామని!" అంటూ నన్ను దగ్గరకు తీసుకోబోయారు. నేను విసురుగా విదిలించుకున్నాను. ఆ రాత్రి నన్ను ప్రసన్నం చేసుకోవటానికి చాలా ప్రయత్నించారు. ఎందుకో నాకు అప్పటినుంచీ అదుటుగా ఉంటుంది ఏ పని చెయ్యాలన్నా. ఆయనకి ముందుగా చెప్పకుండా ఒక్కపైసా ముట్టుకోవటానికి కూడా ఆత్మాభిమానం అడ్డొస్తుంది నాకు. ఒక్కొక్కప్పుడు, ఉద్యోగం చేసి స్వయంగా సంపాదించుకుందామా అన్నంత ఉక్రోషం వస్తుంది. నిజానికి ఆ సంఘటన తరవాత మళ్ళీ ఎప్పుడూ నన్ను అనుమానించినట్లు గాని, అవమానించినట్లు గాని సూచనలు కూడా లేవు. కానీ నాకే ఎందుకో స్వేచ్ఛలేనట్లు ఉంటుంది.

నేరస్థుల్ని పట్టుకోవటం, నేరాల్ని నిరూపించటం ఆయన వృత్తి. అది ఆయన ప్రవృత్తిగా కూడా మారిందనుకుంటాను.

ఒకసారి ఏమైందంటే, రాత్రి ఇద్దరం పెందరాళే భోంచేసి ఏవో పత్రికలు చదువుతూ పడుకున్నాం. ఆ రోజు మరీ పెందరాళే పడుకోవటం వల్ల రాత్రి రెండుగంటల

ప్రాంతంలో మెలుకువొచ్చింది నాకు. బాత్‌రూమ్‌కి వెళ్ళొచ్చి మళ్ళీ పడుకుందామని ప్రయత్నించాను. ఎంతకీ నిద్రపట్టలేదు. ఆయన గాఢనిద్రపోతున్నారని సన్నని గురక పట్టి తెలుస్తోంది. ఆ గురక వల్ల ఇంక నాకు అసలే నిద్రపట్టదనిపించింది. ఆయనవైపుకి ఒత్తిగిలి ఆయన్ని మెల్లిగా కదిపిచూశాను. ఆయనకి మెలుకువ రాలేదు. నాచెయ్యి మెల్లిగా ఆయన చొక్కా కిందినుంచి దూర్చాను-శరీరాన్ని తాకితే మెలుకువొస్తుంది కదా అని. అంతే!

"దొంగ దొంగ" అంటూ గట్టిగా అరిచారు. నా గుండె దడదడ లాడింది. చెయ్యి చటుక్కున వెనక్కి లాగేసుకున్నాను. తీరా పరీక్షగా చూస్తే ఆయన యథా ప్రకారం నిద్రపోతూనే ఉన్నారు. నా స్పర్శకి దొంగ దొంగ అని కలవరించినట్లున్నారు. కానీ ఆయన కేకలికి నా పైప్రాణాలుపైకే పోయినట్లయింది.

ఇంకెప్పుడూ ఈయనతో సరసమాడకూడదనిపించింది. పట్టపగలు ఆయన చూస్తూండగా ఏమన్నా ప్రేమకలాపం సాగిస్తే సాగించాలి గాని ఆయన ఆదమరిచి ఉండగా గాని రాత్రిపూట నిద్రపోతున్నప్పుడు గాని కక్కుర్తి పడ్డానంటే నా పరువుపోయిందన్నమాటే. ఇంట్లో ఎవరూ లేరు కాబట్టి సరిపోయింది. ఆయన అరుపులు ఎవరైనా విని ఉంటే అసలు సంగతి తెలిశాక నవ్వరూ?

నేనెంత జాగ్రత్తగా ఉన్నా నాగుండె బేజారైపోయేట్లుగా ప్రవర్తిస్తారాయన.

ఓనాడు అర్ధరాత్రివేళ అవతలికి వెళ్ళటానికి లేచారాయన. అలికిడికి నాకూ మెలుకువొచ్చింది. అయినా కళ్ళు విప్పలేదు. ఆలోచిస్తున్నాను లేద్దామా వద్దా అని. అసలే పౌర్ణమిరాత్రి. చలి మరింత గజగజలాడిస్తోంది. కప్పుకున్న రొజాయి తీసి తెగించి బయటపడాలంటే ఓపట్టాన మనసు పుట్టదు. మనస్సు దిటవు చేసుకుని రొజాయి చడీ చప్పుడు కాకుండా అతి సౌమ్యంగా తొలిగించి-చలి లోపల ఎక్కడదూరేస్తుందోనన్న భయంతో - తలగడ క్రింద పెట్టుకున్న మఫ్లర్ తీసి తలకి చుట్టుకుని బయటకాలు పెట్టాను.

బాత్‌రూమ్‌లోంచి బయటికొస్తున్న ఆయన అమాంతం ఒక్కగావు కేక పెట్టారు. నాగుండె అరక్షణంపాటు ఆగిపోయినట్లయింది. నాకు అసలే పురుగూ పుట్రా అంటే చిన్నప్పటినుంచీ భయం. "అమ్మ బాబోయ్" అంటూ ఒక్కగెంతులో మంచంమీది కెగిరాను.

"దొంగ దొంగ" అని అరుస్తూ ఒక్కదూకులో వచ్చి నన్ను పట్టుకున్నారు. 'ఏమిటండీ' అన్నాను నిలువెల్లా వొణికిపోతూ. ఆయన అంతకన్నా కంపిస్తున్నారు ఆపాదమస్తకం. ఒక్క పరుగున రావటం వల్ల ఒగరుస్తున్నారు.

దొంగ ఎక్కణ్ణించి వచ్చాడు, ఏమిటి సంగతి అని మళ్ళీ అడిగితే మండి పడతారని మాట్లాడకుండా వొణుకుతూ కూర్చున్నాను. చలికి కొంతా, భయానికి కొంతా. ఆయనకి వొణుకుడూ, ఒగుర్పూ తగ్గినట్లుంది కాస్సేపటికి తీరిగ్గా "నీ దుంప తెగా!" అన్నారు.

నేను నివ్వెరపోయాను. అర్ధరాత్రప్పుడు నేను చేసిన అపరాధం ఏమిటి చెప్మా అని.

"నువ్వెప్పుడు లేచావ్! నేను లేచి వెళ్ళేసరికి మొద్దులా నిద్ర పోతున్నావుగా. నువ్వు గదిలోంచి బయటి కొస్తూంటే నీ నీడ గోడమీద పడింది – ఆ మఫ్లరూ, నువ్వూ, పచ్చి దొంగలా కనిపించావ్!" అన్నారు.

"అవును లెండి, కామెర్లవాడికి లోకమంతా పచ్చగా కనిపించినట్లు మీకు ప్రతివాళ్ళూ దొంగల్లాగే కనిపిస్తారు!" అన్నాను ఉడుకుమోత్తనంతో.

"ఈ లెక్కన ఈయన నాకు ఏ క్షణాన చేతులికి కడియాలు తొడిగి ఊరేగింపుతో తీసుకెళ్ళి శ్రీకృష్ణ జన్మస్థానంలో పెడతారో నన్నట్లు నా ప్రాణాలు గుప్పెట్లో పెట్టుకుని బ్రతుకుతున్నాను."

●●●

నాకు నవ్వాగలేదు, ఆవిడ కథ విన్నాక. ఇంటికొచ్చాక కూడా నాలో నేను ముసిముసి నవ్వులు నవ్వుకుంటూంటే వదిన చూసింది.

'ఏమిటి వసంతా, అంత నవ్వొచ్చే సంగతి'! అంది.

అంతా విన్న తరువాత పడిపడి నవ్వి "నన్ను కూడా నీతో తీసుకు వెళ్ళకపోయావా, ఇంటో ఒక్కర్తెనీ కూర్చున్నాను" అంది.

"సారీ, వదినా, కానీ నువ్వు కూడా ఉంటే ఆవిడ అలా మాట్లాడటానికి మొహమాట పడేదేమో! ఎంతయినా నువ్వు గృహిణివి కదా" అన్నాను.

"మొత్తం మీద నీ కాలక్షేపం వ్యవహారం బాగానే ఉంది. చూస్తానుగా ఎంతటి ఘనుడైన వరుణ్ణి చేజిక్కించుకుంటావో!" అంది వదిన నవ్వుతూ.

మర్నాడు యూనివర్సిటీ నుంచి వచ్చిన తరువాత కాఫీ, టిఫినూ తీసుకుని, హడావిడిగా బయలుదేరబోతూంటే వదిన చూసి 'ఇవాళ ఏ ఉద్యోగి భార్యని తగులుకుంటున్నావ్' అంది కన్ను గీటుతూ.

నేను ముక్కు మీద వేలేసుకుని 'వ్యవహారం మీద వెళ్ళేవాళ్ళని అలా అడక్కూడదని తెలియదూ?' అంటూ అసలు సంగతి చెప్పకుండా సస్పెన్స్‌లో పెట్టి చల్లగా బయటికి జారుకున్నాను.

నిజానికి అప్పటిదాకా ప్లాన్ చేసుకోలేదు. ఎవరెవర్ని కలుసుకోవాలని, ఎవరు గుర్తుకొస్తే వాళ్ళని చూడటం మొదలుపెట్టాను. ఇక ముందు అలా కాకుండా ఒక పథకం తయారు చేసుకోవాలని నిశ్చయించుకున్నాను.

ఆ పూటకి మాత్రం మా పక్కవీధిలో ఉంటున్న డాక్టరుగారింటికి వెళ్ళాను. ఆవిడ నలభైదాటిన మనిషి అయినా చాలా సరదాగా చలాకీగా ఉంటుంది. ఆవిడకి నేనంటే ఇష్టం కూడా. అందుకని ఎంతో ఉత్సాహంగా బయలుదేరాను.

నన్ను చూస్తూనే ఆవిడ 'రా, వసంతా, రా' అంటూ పిలిచి, 'ఇవాళ పొద్దుటినుంచీ కాకి ఒకటే అరుపు, చుట్టాలెవరొస్తారా అని పొద్దుటి నుంచి ఎదురు చూస్తున్నాను' అంది. ఆవిడ ఆప్యాయత చూస్తుంటే అమాంతం ఆవిడ ఒళ్ళో కూర్చోవాలనిపిస్తుంది నాకు.

నేను వచ్చిన పని చెప్పాను సూటిగా - ఆవిడ ప్రేమమాటల్లో మునిగితే మళ్ళీ తేలటం కష్టం అని.

"ఏమమ్మా, రోగాలు కొని తెచ్చుకోవాలని ఉందా డాక్టర్ని చేసుకోవాలనుకుంటున్నావ్!" అంది పరిహాసంగా.

"అబ్బే, నేనేమీ ఇంకా నిశ్చయించుకోలేదండీ. మీ అనుభవం గురించి తెలుసుకుని ఏసంగతీ తేల్చుకుందామనుకుంటున్నాను".

"అయితే ఉన్నదున్నట్లు చెబుతాను. ఆపైన నీ ఇష్టం. నాపూచీ ఏం లేదుస్మీ" అంది ఇంజనీరుగారి భార్య లాగ. నేను బుద్ధిమంతురాలిలా చేతులు కట్టుకుని కూర్చున్నాను. ఆవిడ చెప్పటం ఆరంభించింది.

**డాక్టరు గారి భార్య**

"పెళ్ళికొడుకు హౌస్ సర్జన్ అని విని సంబరపడ్డాను. హౌస్ సర్జన్‌కి హౌస్ వైఫ్‌ని అవటం నా అదృష్టం అని మురిసిపోయాను. అయితే, నా చదువు మధ్యలో ఆపటానికి వీల్లేదు. బి.ఎ. పూర్తి చేయించమని పెళ్ళికొడుకు పట్టుపడుతున్నాడనీ, నా చదువు పూర్తయేసరికి తను ప్రాక్టీసు పెట్టి స్థిరపడటానికి వీలవుతుందని అన్నాడనీ విని కొంత నిరుత్సాహపడ్డాను. సంబంధం కుదిరిందనగానే చదువుకి టాటా చెప్పేసి హాయిగా ప్రణయలోకాల్లో విహరిద్దామని ఊహించుకుని ఉయ్యాల లూగుతున్న నేను ఒక్క ఊపుకి నేలమీద పడ్డట్టు బాధ పడ్డాను. అంతలోనే నన్ను నేను సమాధాన పరుచుకున్నాను. డాక్టరు భార్య కావటమంటే సామాన్యమా! ఎంత దర్జా! ఎంత హోదా! ఆయనకి తగినట్లుగా నేను కూడా పెద్ద చదువులు చదివి ఆయన ముందు రాణించవద్దామరి! అనుకుని చదువులో నిమగ్నం కావటానికి ప్రయత్నించాను లగ్నం పెట్టే వరకూ.

పెళ్ళయ్యాక విడిదిలోకి వెడుతున్నప్పుడు ఆయన్ని నా చెయ్యి పట్టుకుని ముందుకి నడవమన్నారు. ఆయన నా చెయ్యి పట్టుకున్న తీరు చూసి మా తమ్ముడు పకపకా నవ్వుతూ 'ఏమిటండోయ్ బావగారూ, మా అక్కయ్య నాడి చూస్తున్నారా?' అన్నాడు. ఆయన చిరునవ్వు నవ్వి నా చిటికెన వేలు పట్టుకున్నారప్పుడు.

ఆ రాత్రి ఆయన ప్రవర్తన చూస్తే కన్యాత్వానికి శస్త్ర చికిత్స చేసినట్లనిపించింది గాని, కథల్లోనూ కావ్యాల్లోనూ వర్ణించినట్లు సంభోగలీలగా అనిపించలేదు. అంతా అయ్యాక, "ఇటివిల్‌బి ఒ.కె. డోన్ట్ వర్రీ" అన్నారు. నా చీర మోకాళ్ల క్రిందికీ, దుప్పటి గుండెల మీదకీ లాగుతూ, "థాంక్యూ డాక్టర్" అన్నాను పళ్ళు బిగించి.

ఆయన డిస్పెన్సరీ ఇంట్లోనే పెట్టుకున్నారు. ఇంటికి ముందు భాగంలో ఆయన డిస్పెన్సరీ, వెనక భాగంలో మా కాపురం. ఇంట్లో ఉన్నారన్న పేరేగాని డిస్పెన్సరీలో కాలు పెట్టారంటే ఇంక ఇల్లూ ఇల్లాలూ ఆయనకి గుర్తుండరు. ఒక వేళాపాళా లేదు ఆ రోగులికి. 'డాక్టరు గారూ' అనీ, 'బాబుగారూ' అనీ ఎవరన్నా రోగి గాని రోగితాలూకు మనిషి గాని పిలవటం తడవు 'సిరికింజెప్పడు' అన్నట్లుగా పరుగెత్తుతారు. పొద్దుటి నుంచి రాత్రిదాకా ఆయన కోసం నిరీక్షించటమే నా ఉద్యోగమయి పోయింది.

పెళ్ళికాని క్రితం పొద్దున్నే తొమ్మిదింటి లోపల భోజనం చెయ్యటం, మళ్ళీ మధ్యాహ్నం లంచ్, రాత్రి డిన్నరూ, మూడుసార్లు అన్నం తినటం అలవాటయింది. పెళ్ళయింతరవాత ఈ అలవాటులో మార్పు వచ్చేసరికి ఒడ్డునపడ్డ చేపల్లా గిలగిల్లాడాను. ఆయనకి పొద్దున్నే బాయిల్డ్ ఎగ్గూ, ఒక గ్లాసు పాలూ, వాటితోబాటు బిస్కట్లూ, ఏదో పండూ తినటం అలవాటు. నాకు ఆ పాలంటే డోకు. అదిచూసి ఆయనకి షాకు. నేను పొద్దున్నే ఒక కప్పు స్ట్రాంగ్ కాఫీ తాగుతాను. కాఫీ తాగిన తరువాత ఆయనతో బాటు పళ్ళు తినబుద్ధి వేసేది కాదు. రెండో మూడో బిస్కట్లు తింటే ఏ మూలకి? కోడిగుడ్లు నేను జన్మలో ముట్టుకుని ఎరగను. పని కుర్రవాడే ఉడక పెట్టి ఇచ్చేవాడు ఆయనకి.

"బొత్తిగా ప్రొటీన్స్ లేవు నువ్వుతినే ఆహారంలో. పాలూ, కోడిగుడ్డూ లేకపోతే ఆరోగ్యంగా ఎలా ఉంటావ్?" అని ఉపన్యసించేవారు.

"ఏమో, నాకు పుట్టినప్పటినుంచీ మావాళ్ళు కోడిగుడ్డు పెట్టలేదుస్మండి. హాయిగా ఆవకాయ, గడ్డపెరుగూ వేసుకుని చద్దెన్నం తినటం అలవాటు నాకు. ఏం, ఇప్పుడు నాకేం లోటు వచ్చిందని!" అని వాదించాను.

'అదీ, అందుకే అంత పేల్‌గా ఉంటావు!' అన్నారు నా కంటి దగ్గర చర్మం క్రిందకి లాగి కంటిలోపలికి చూస్తూ.

ఆయన మరీ బలవంతం చేసిన మీదట ఒక రోజు పాలు తాగి చూశాను. భొళ్ళున డోకొచ్చినంత పనయింది.

"పోనీ, యాపిల్ అయినా తిను రోజూ" అన్నారు.

"వద్దు బాబూ, ఇట్ కీప్స్ మై డాక్టర్ ఎవే!" అన్నాను.

నా ఒక్కర్తె కోసం పొద్దున్నే ప్రత్యేకం టిఫిను ఎక్కడ చేసుకుతిన్నని చెప్పి బ్రెడ్ తెప్పించుకు తినేదాన్ని. అలవాటు లేక ఆకలి తీరక కడుపు నకనక లాడిపోయేది మధ్యాహ్నం భోజనం వేళకి.ఆయన భోజనానికి ఒక వేళకి అంటూ రారు. ఓరోజు ఒంటిగంట. ఓరోజు రెండు, రెండున్నర, ఆ రోగుల సంఖ్యను బట్టీ, రోగాల తీవ్రతనిబట్టీ ఆయన భోజనం వేళ మారుతూ ఉండేది. పని హడావిడిలో ఉండటం వల్ల ఆయనకి ఆకలి తెలిసేది కాదు. ఊరికే కూర్చునేసరికి నా ప్రాణాలు పోతున్నట్లుగా ఉండేది.

అప్పుడప్పుడు విసుక్కునేదాన్ని "ఏమిటిబాబూ, తిండికి మొహం వాచేటట్లు చేస్తున్నారు" అని. పోనీ అలాంటప్పుడైనా "నువ్వుతినేసి కూర్చోరాదూ" అని మాటవరసకైనా అనేవారు కాదు. పాతివ్రత్యం పేరుతో ఆయన మాట జవదాటకూడదని తినేసి కూర్చునేదాన్నే. కాని, నాతో కలిసి భోంచెయ్యాలని అనుకునేవారు కాబోలు. పోనీ, ఆ మాటపైకి అంటే ఎంత మురిసిపోదును! అలా కాకుండా, "అందుకే నాతోబాటు కోడిగుడ్డూ, పాలూ, పళ్ళూ తీసుకోమంటాను. శరీరంలో దారుఢ్యం ఉండొద్దా! నువ్వుతినే దాంట్లో ఏముంది? బలం రమ్మంటే ఎక్కణ్ణించివస్తుంది? అలా ఈసురోదేవుడా అంటూ కూర్చోకపోతే పొద్దున్నే బలమైన పదార్థాలు తినరాదూ? ఆరోగ్యం బాగుపడటంతోబాటు ఆకలికూడా తీరుతుంది", అనే వారు.

మధ్యాహ్నం భోజనం చేసి కాస్సేపు నాతో కబుర్లు చెబుతూ విశ్రాంతి తీసుకోవాలని ఆయనకి తోచేదికాదు. ఒక వేళ నేను కబుర్లలో దించినా ఎవడో రోగివచ్చి ఆయన్ని గద్దలా తన్నుకుపోయేవాడు. నేను వెర్రిమొహంవేసుకుని ఒక్కర్తెనీ కూర్చునేదాన్ని.

సాయంకాలం పూట ఎక్కడికైనా షికారుగా వెడదామనుకుంటే ఆయన మెడికల్ జర్నల్స్, బుక్సూ ముందు వేసుకుని చదువుకునేవారు. రాత్రి నిద్ర పోయేముందు కాస్సేపు నన్ను ముద్దుచేసి, అటుపైన కుటుంబ నియంత్రణ పద్ధతి ప్రకారం ప్రణయ వ్యవహారం సాగించి, తరవాత గ్లాసుడు పాలుతాగి తేన్చి పడుకునేవారు. నాకు ఒళ్ళు మండుకొచ్చేది. ఆ వ్యవహారం చూస్తూంటేనే నాకు జుగుప్స కలిగి ఆఖరికి ప్రణయం అంటేనే విరక్తి పుట్టడం ప్రారంభించింది. ఛీ, డాక్టరుని ఎందుకు పెళ్ళి చేసుకున్నానా అని విచారించానుకూడా ఒక్కొక్కప్పుడు.

సాటి డాక్టర్ల భార్యల్ని తలచుకుని కొంత ఊరడి పొందాను.

కానీ, క్రమంగా నా సహనం సన్నగిల్లటం ప్రారంభించింది. అప్పుడప్పుడు ఆయనతో దెబ్బలాడేదాన్ని నన్ను బొత్తిగా లక్ష్యపెట్టటం లేదని. ఆయన మాత్రం విసుక్కుని నాతో సమానంగా వాదించేవారు కాదు. నా ఉద్రేకం చూసి, "నీకు బలహీనత ఎక్కువవుతోంది. పాలు తాగమంటే తాగవు. 'బి' విటమిన్ వేసుకోవు రెగ్యులర్‌గా. ఎన్నిసార్లు చెప్పినా వినవు" అనేవారు తాపీగా.

"వెధవ 'బి' విటమిన్ మాత్రలు నేను మింగలేను. కంపు. అయినా అసలు విషయం తప్పించి విటమిన్ల మాట ఎత్తుతారెందుకు?" అని రెట్టించేదాన్ని.

నాగోల చెవిటివాడిముందు శంఖం ఊదినట్లుగానే ఉండేది. ఒకసారి సిగ్గువిడిచి కోపంతో అనేశాను. "మీ వ్యవహారం నాకేం నచ్చట్లేదు, నాకు పిల్లలు కావాలి" అని.

"అప్పుడే!" అని ఆశ్చర్యపోయారు.

"అప్పుడే ఏమిటి! నేనింకా చంటిపిల్లననుకుంటున్నారా?" అన్నాను.

ఏ కళన ఉన్నారో, ఒప్పుకున్నారు. కానీ, మనం అవుననగానే సరిపోతుందా? ఆ భగవంతుడికి మూడ్ కుదరవద్దూ? ఎన్నితంటాలు పడ్డా ఏమీ కాలేదు. నేను నిరుత్సాహపడ్డాను. బాధ పడ్డాను. కానీ ఆయన చాలా నిర్లిప్తంగా తీసుకున్నారు.

"మనదేశంలో పెళ్ళి అనేది కెమెరా లాంటిది. శారీరకంగా మనం క్లిక్ కాలేదు-దట్సాల్" అన్నారు.

సమానాంతర రేఖల్లా మా జీవితాలు కొనసాగాయి. కలుసుకోనూ లేక విడిపోనూలేక-ఎవరిత్రోవని వారు పోతూనే బండి లాక్కొస్తున్నాం.

రోగులూ రోగాలూ తప్ప ఆయనకి మరో ధ్యాసలేదు. నేను కాలక్షేపం లేక గిలగిల్లాడి పోయేదాన్ని. అంతకంతకి నాకు అసహనం, అసంతృప్తీ అధికమై పోయాయి.

ఓ రోజు సాయంకాలం ఎవరింటికో పార్టీకి వెళ్ళాల్సి వచ్చింది. ఇద్దరం తయారై వెళ్ళబోతూంటే ఏదో ఎమర్జన్సీకేసొచ్చింది.

"నువ్వొక్కర్తివీ వెళ్ళిరాకూడదూ" అన్నారు నాతో. నాకు కోపం, దుఃఖం ముంచు కొచ్చాయి.

"మీకు ఆ పేషంట్లే ముఖ్యం. పెళ్ళాం ఎలా పోయినా ఫరవాలేదు మీకు" అన్నాను గాద్గదికంగా.

"నో, యూ ఆర్ మైడియరెస్ట్ పేషంట్" అన్నారాయన. పోనీ అలా అంటున్నప్పుడైనా నన్ను తమ బాహువుల్లో బంధిస్తారని నా తనువు తహతహలాడింది. బాగ్‌లో చకచకా కావలసిన పరికరాలూ మందులూ సర్దుకుని చరచరా బయటికి వెళ్ళిపోయారు.

నేను తలనొప్పి అని బాధపడటం, మధ్య మధ్య అరవటం, కేకలెయ్యటం, ఏడవటం- ఇవన్నీ పరీక్షించి బ్లడ్‌ప్రెషర్ అని తేల్చారు. బాధ తక్కువగా ఉండి నిద్రపట్టకపోతే 'ఫోర్‌స్టాల్', మరీ బాధగా ఉండి గిలగిల్లాడుతూంటే 'ఈక్విబ్రామ్' ఇస్తూండేవారు. ఏదోవిధంగా నిద్ర పట్టటం ముఖ్యం కాబట్టి ఆయన ప్రణయరహితంగా ఇచ్చినా ప్రేమ భరితంగా ఇస్తున్నారని మనస్సుకి నచ్చజెప్పుకుని మందులు పుచ్చుకుంటూండేదాన్ని.

వయస్సు ముదురుతున్న కొద్దీ వ్యాధులుకూడా ముదురుతాయి. కొత్తకొత్త వ్యాధులు సంక్రమిస్తాయి. నాకేదైనా కాస్త కొత్త కంప్లెయింట్ వస్తేచాలు-అరటిచెట్టుకి కొత్తపిలక వేస్తే సంబరపడినట్లుగా ఆయన నూతనోత్సాహంతో నన్ను ట్రీట్ చేసేవారు. నామీద మరింత జాలిపడి మరింత ఆప్యాయంగా బజారులోకొచ్చిన సరికొత్త మందుల్నీ, ఎంతో ఖరీదైన మందుల్నీ నా కోసం వాడేవారు.

నాకు మందులు మింగటం అంటే డోకు అనీ, చిన్నప్పుడు మా అమ్మనీ నాన్నగారినీ మోసగించి మందులు తాగకుండా మెల్లిగా తూములో పారబోసేదాన్ననీ పెళ్ళయిన కొత్తలో ఓసారి నవ్వుతూ సరదాగా చెప్పాను ఆయనతో. ఆ విషయం గుర్తుపెట్టుకుని ఆయన స్వయంగా మాత్ర నానోటిలో పెట్టి మంచినీళ్ళ గ్లాసు నోటికి అందించి గుటకవేసేదాకా నాకేసి జాగ్రత్తగా పరీక్షగా చూస్తారు. నాచేత మందులు మింగించటం ఆయనకి వినోదక్రీడలా ఉంటుంది. నేను ఎంతగోల చేసినా విసుక్కోరు. పైగా నేను మారాం చేసిన కొద్దీ ఆయనకి ప్రేమ ఎక్కువవుతుంది నామీద. నా చేత మందులు మింగిస్తే ఆయన విజయం సాధించినట్లు ఆనందిస్తారు.

ఈ మధ్య ఆయన ఒక కొత్తపాట మొదలుపెట్టారు. నేను తల నొప్పి అని మూలిగినా, చిరాకుపడి ఆయన మీద విసుక్కున్నా, అరిచినా ఏడ్చినా, "నాకు తెలుసు, ఇవన్నీ ఆ మెనోపాజ్ లక్షణాలే! అంటున్నారు. నేను అనుక్షణం ఆయన ప్రత్యేక పర్యవేక్షణలో ఉన్నానిప్పుడు."

●●●

ఆవిడ చెప్పిందంతా విన్న తరవాత డాక్టరు గారంటే నాకున్న గౌరవం మరింత ఇనుమడించింది. ఆవిడకి పిల్లలుంటే అంత ఒంటరితనం అనుభవించి ఉండేది కాదు. మంచి డాక్టర్లు ఎవరైనా సరే రోగుల మీద శ్రద్ధ చూపిస్తారు - ఇంటిని అశ్రద్ధ చెయ్యవలసి వచ్చినా సరే. కానీ డాక్టర్లని చూస్తే పితృభావం కలుగుతుంది నాకు. పెళ్లి చేసుకోవాలంటే ఎలా చేసుకోను?

డాక్టరువైపు మనస్సు మొగ్గటం లేదు. మొదటి నుంచీ దాదాపు మా నాన్న గారి వయస్సులో డాక్టర్లతో పరిచయం ఉండటంవల్ల కావచ్చు. ఏమైనా డాక్టర్ని డాక్టరు స్థానంలోనే ఉంచటం ఉభయత్రా శ్రేయస్కరం. కానీ, అందరూ నాకు మల్లే ఆలోచిస్తే ఆ డాక్టర్లకి పెళ్ళిళ్ళవద్దూ! సర్లే, వాళ్ళ బాధేదో వాళ్ళు పడతారు. మధ్య నా కెందుకు అనుకుని ముందుకి సాగాను పథకం ప్రకారం.

ఆ రోజు అట్టే దూరం వెళ్ళ దలుచుకోలేదు. మా ఇంటి వెనకనే ఒక కవిగారి కుటుంబం ఉంది. నిజానికి కవిని చేసుకోవాలనే ప్రత్యేకమయిన అభిలాష నాకేంలేదు. ఆ కవిగారి ఉద్యోగం కేవలం కవిత్వం రాయటం మాత్రమే కాదు, వేరే ఏదో ఉద్యోగం చేస్తున్నాడు. ఆయన భార్య అప్పుడప్పుడు మా ఇంటికి పేరంటానికీ, చిన్న చిన్న అప్పులికీ వస్తూ ఉంటుంది. వచ్చినప్పుడల్లా కాస్సేపు కూర్చుని మా వదినతోనూ నాతోనూ కబుర్లు చెప్పి వెడుతూ ఉంటుంది. ఆ చనువుకొద్దీ ఆవిడ సంసారం ఎలా సాగుతోందో చూద్దామన్న కుతూహలంతో మాత్రమే వెళ్ళాలనుకున్నాను. ఒకవేళ నచ్చితే కవిని చేసుకోవటానికి కూడా నాకు అభ్యంతరంలేదు.

వాళ్ళింటికి వెళ్ళగానే ఆవిడ జంతికలు ప్లేట్లో పెట్టి ఇచ్చింది. "చాలా బాగా చేశారండీ" అన్నాను కరకరలాడుతూ వాము ఘాటుతో ఉన్న జంతికలు తింటూ.

"ఈ పిండివంట ఒక్కటే వచ్చునమ్మా నాకు! ఆయనకి జంతికలు పటుకూ పటుకూ నముల్తూ పద్యాలు రాయటం అలవాటు. సిగరెట్లు కన్న ఇదే నయం లెమ్మని ఎప్పుడూ చేసి ఉంచుతాను" అంది.

"ఏమండీ రాజేశ్వరిగారూ, కవిని పెళ్లి చేసుకుంటే కాపురం ఆనంద దాయకంగా ఉంటుందంటారా?" అని అడిగాను యథాలాపంగా అడిగినట్లు. నే వెళ్ళినపని ఏమిటో వివరంగా ఆవిడతో చెప్పలేదు. నా ప్రశ్న వినగానే ఆవిడ కళ్లు మిలమిల మెరిశాయి. ఆవిడ ఆనందాతిశయంలో ఉండడం వల్ల అలామెరిశాయో, లేక తన గుండెల్లో గూడు కట్టుకున్న బాధ వినటానికి ఇన్నాళ్ళకో సహృదయం కనిపించిందన్న ఉత్సాహం వల్ల మెరిశాయో తెలియలేదు నాకు.

అయినా నాకు మాత్రం తృప్తి కలిగింది ఆవిడ మనస్సు విప్పి అన్నీ నాతో చెప్పే స్థితిలో ఉన్నందుకు. నేను మరో ప్రశ్న వెయ్యకుండానే ఆవిడ అందుకుంది.

**కవిగారి భార్య**

"కవి కదా అని కాదు నేను ఆయన్ని చేసుకున్నది. అసలు ఆయన చేసే ఉద్యోగం వేరు. ఎలెక్ట్రిసిటీ డిపార్ట్‌మెంటులో స్టోర్సు సూపర్‌వైజరు. కథా రచయితగానూ కవిగానూ ఆయనకి పెళ్ళినాటికే కాస్త పేరుంది. భుక్తికోసం ఉద్యోగం ఎలెక్ట్రిసిటీ డిపార్ట్‌మెంటులో

చేస్తున్నారన్నమాటే గాని ఆయన మనస్సంతా కథలమీదా కవిత్వం మీదా ఉంటుంది. ఆయన కోసం ఇంటి కొచ్చే స్నేహితులు కూడా అందరూ సాహిత్యకారులే. అందుచేత కవిగారి భార్యగానే చలామణీ అవుతున్నాన్నేను.

పెళ్ళయిన కొత్తలో కథలే ఎక్కువగా రాస్తూ ఉండేవారయన. మరీ ఉద్రేకం పట్టలేనప్పుడు తప్ప కవిత్వం రాసేవారుకాదు. ఒక విధంగా కవిత్వం రాయమనీ, కథలు రాయటం తగ్గించమనీ ప్రోత్సహించినది నేనే. కవిత్వం మీద మోజుకొద్దీ కాదుస్మండీ.

ఆయన రాసే కథల్ని ఎరుగని వాళ్ళు మెచ్చుకునేవారు. ఆయన్ని ఎరుగున్నవాళ్లు మాత్రం కథలు చదివాక ఎడమొహం పెడమొహం పెట్టడం ప్రారంభించేవాళ్ళు. అవునుమరి, పరిచయమైన ప్రతివాళ్ళ మీదా ఓ కథ రాసి పారేస్తూంటే వాళ్ళని నడివీథిలోకి ఈడ్చినట్లుగా బాధపడరూ! బాధపడి మాతో స్నేహాన్ని తగ్గించేసేవారు. పోనీ ఏదో హాస్యంగా రాస్తే వీళ్ళూ నవ్వి ఊరుకుంటారు. కానీ ఈయన వాళ్ళని దుయ్యబడుతున్నట్లుగా సంఘసంస్కర్తలా రాసేవారు.

ఇంటికెవరైనా నా స్నేహితురాలు గాని, పక్కింటావిడగాని రావటం తడవు, ఈయన పదిసార్లు ఏదోవంక పెట్టుకొని మేము కూర్చున్న వైపుకి రావటం, మా సంభాషణలు చెవులు నిక్కబొడుచుకుని వినటం చేసేవారు. పోనీ, విని ఊరుకుంటారా అంటే-మర్నాడు ఆ సంభాషణలు ఆయన కథల్లోకి చొరబడేవి. ఆయన కథలు చాలా వాస్తవికంగా ఉంటాయని ఎరగని వాళ్ళు మెచ్చుకునేవారు. ఎరుగున్న వాళ్ళముందు నేను మాత్రం తలెత్తుకుని తిరగలేకపోయేదాన్ని.

"పేరు ప్రఖ్యాతుల మాట దేముడెరుగు. మీరు కథలు రాశారంటే ఊరుకునేది లేదు-కావాలంటే కవిత్వం రాసుకోండి" అన్నాను.

ఒకసారి ఈ విషయంమీదే మేం ఛడామడా వాదించుకున్నాం. చివరికి ఆయనకి కోపం వచ్చి తలుపు ధడాలునవేసి ఇంట్లోంచి వెళ్ళిపోయారు. రాత్రి తొమ్మిది దాటినా కొంపకి రాకపోయేసరికి భయం వేసింది.

"పాపిష్టిదాన్ని, అనవసరంగా ఆయన్ని ఆడిపోసుకున్నాను. కథలు రాయటం అంటే మాటలా! పక్కింటివాళ్ళ మీద అయితే మాత్రం ఆయన రాసినట్లుగా వెయ్యిజన్మలెత్తినా నేను రాయగలనా? ఇంకెప్పుడూ అయనని పల్లెత్తుమాటనను. భగవంతుడా, ఆయనకి కోపం తెప్పించకు. ఆయన త్వరగా ఇంటికొచ్చేటట్లు చెయ్యి" అని ప్రార్థించాను.

ఆయన పది అవుతూంటే వచ్చారు ఇంటికి. వస్తూనే తలవంచుకుని సూటిగా రాతబల్ల దగ్గరికి వెళ్ళి కుర్చీలో కూర్చుని చకచకా రాయటం మొదలు పెట్టారు. అరగంటదాకా ఆయన్ని పలకరించటానికి జంకాను. ఆయన స్పీడు తగ్గింతరువాత కొంచెం ధైర్యం చేసి "అన్నం వడ్డించాను రండి" అన్నాను.

"ఇలారా ముందు" అన్నారు. సౌమ్యంగానే పిలిచినా బిక్కుబిక్కుమంటూ సమీపించాను. ఆయన రాసిన పద్యాలు చూపించారు. చదివాక సిగ్గుతో ముసిముసినవ్వులు నవ్వాను. నామీద అపరిమితమైన అనురాగాన్ని వెల్లడిస్తూ రాశారు.

"నామీద కోపం పోయిందా?" అన్నాను మురిపెంగా.

"నీమీద నాకు కోపం ఏమిటే!

నీవే నాజీవన జ్యోతివి

నా వనమెల్ల చెరిచిపోతివి" అంటూ నాచెవి మెలిపెట్టారు.

అప్పటి నుంచీ ఆయన కథలు రాయటం తగ్గించి కవిత్వం రాయటం హెచ్చించారు. కాగితాల ఖర్చు తగ్గింది. స్నేహితులతో గొడవలు తగ్గాయి అని సంబరపడ్డాను.

ఓసారి నెలాఖరు రోజున ఎవరో స్నేహితులింటికి వాళ్ళపిల్ల పుట్టిన రోజు పండక్కి వెళ్ళాల్సి వచ్చింది. చేతిలో డబ్బులేదు-ఏదైనా బహుమతి కొని తీసుకువెళ్ళటానికి. మర్నాడు జీతం వస్తుంది కదా అని ఎలాగో నెట్టుకొస్తూంటే ఆ పార్టీ ఒకటొచ్చిపడింది.

ఉత్తిచేతుల్తో వెళ్ళటం ఎలాగని నేను బాధపడుతూంటే ఆయన నిశ్చింతగా పద్యాలు రాస్తూ కూర్చున్నారు. నాకు మండుకొచ్చింది. 'నేను రాను. మీరు వెళ్ళిరండి కావాలంటే' అన్నాను.

"పిచ్చిదానా, బహుమతి కొనటానికి డబ్బుల్లేవనేగా నీబెంగ! అంత కన్న అమూల్యమైన కానుక సిద్ధం చేశాను చూడు!" అంటూ ఆయన రాసిన పద్యాలు చూపించారు. చదివాను. ఆ స్నేహితుడి కూతుర్ని ఆశీర్వదిస్తూ రాసిన పద్యాలవి. ఆ పిల్లకి మూడో ఏడొచ్చింది. 'ముచ్చటగా మూడు' అని మూడు పద్యాలు రాశారు ముత్యాల్లాంటి మాటలతో. నేను కృతజ్ఞతాపూర్వకంగా చూశాను ఆయన కేసి.

పార్టీలో ఆ పిల్లకి వచ్చిన బహుమతులన్నిటిలోకీ మావారు ఇచ్చినదే అందర్నీ ఆకర్షించింది. హర్షధ్వానాలు చేశారు పద్యాలు విని.

అప్పటినుంచీ ఆ పద్ధతే బాగుందనుకున్నారు ఆయన-నయాపైస ఖర్చులేకుండా నాణ్యమయిన బహుమతి ఇవ్వటం.

'ముచ్చటగా మూడు' తరవాత 'పంచ వర్ణాలు', సప్తస్వరాలు, 'నవరత్నాలు' అంటూ పద్యాలు క్రమంగా సంఖ్య హెచ్చించుకుంటూ పోయి వాటిని పెళ్ళిళ్ళలో కూడా గొప్పగా బహూకరించడం ప్రారంభించారు.

కొత్తలో ఒకటి రెండుసార్లు శభాష్ అనిపించుకున్నారు. కవిగారి భార్యనని నాకూ సన్మానం జరిగింది. కానీ, ప్రశంసలతో బాటు ఆయన పద్యాల సంఖ్య కూడా పెరిగిపోతున్న కొద్దీ ఆయన్ని పెళ్ళి పందిట్లో చూడగానే జనం జంకటం మొదలుపెట్టారు.

'నూరు వరహాలు'అంటూ ఓ పెళ్ళిలో ఆశీర్వచనగానం లంకించుకునేసరికి ఆయన్ని ఎలా ఆపాలో ఎవరికీ అర్థంకాలేదు. భజంత్రీలని ఆపండి ఆపండి అని అరిచినట్లుగా పురోహితుడు ఈయనకేసి, చూసి "అయ్యా, బాబుగారూ, వివాహకార్యక్రమం ఇంకా పూర్తికాలేదు-అవతల పెళ్ళి వారికి భోజనాలకి వేళయిపోయింది. తమరు ఆ కాగితాలేవో వధూవరులికి అందించేస్తే వారే చదువుకుంటారు అనక" అన్నాడు పిలక ఝాడించి ముడి వేసుకుంటూ. చుట్టుపక్కల వాళ్ళంతా గొల్లుమని నవ్వారు. నా తల కొట్టేసినట్లయింది.

ఇంటి కొచ్చిన తరవాత నేను చాలాసేపు ఆయనతో మాట్లాడలేదు, ఆయన కూడా మౌనంగా పడుకున్నారు. ఇక నేనే ఉండబట్టలేక పోయాను.

"పోనీ, ఆ ఇచ్చేదేదో నాలుగు అక్షింతలు వాళ్ల నెత్తిన పడేసి ఆ కాయితాలు వాళ్ళ చేతుల్లో పెట్టేసి వస్తే పోలే? ఎందుకా కంఠశోష! నలుగురిలోనూ నవ్వుల పాలు కావటానికి కాకపోతే! అయినా, సరదాగా ఏదో నాలుగైదు పద్యాలు రాస్తే ముచ్చటగా ఉంటుంది గాని, వానాకాలం వరదలాగ వందలకొద్దీ పద్యాలు రాసి చదివితే వినే ఓపిక ఉండద్దా! అందులోనూ అటువంటి గందరగోళంలో!" అంటూ ఉపదేశించాను ఆయనకి జ్ఞానోదయం అవ్వాలని.

"నా కంఠ మాధుర్యాన్ని ఆనందించలేకపోతే అది వాళ్ళ కర్మ! గాడిదకేం తెలుసు గంధం వాసన అన్నట్లు నా కవితా గాన మాధుర్యం నీకేం అర్థమవుతుందిలే!" అన్నారు.

"అవును లెండి! నాకు మీ కవితాగాన మాధుర్యం అర్థం కాదు. ఈసారి వందకాదు, వెయ్యి నూటపదహార్లు పాడి వినిపించండి-ఎవరిని గాడిదంటారో తెలుస్తుంది!" అన్నాను ఉక్రోషంతో.

•••

ఇంటికి వస్తూనే "వదినా, వదినా" అంటూ అరిచాను. ఏమిటోనని కంగారు పడుతూ వచ్చింది.

"నువ్వెప్పుడైనా మన వెనకింటి కవిగారి పద్యాలు విన్నావా?" అన్నాను నవ్వుముఖంతో.

"ఏం బాబోయ్! ఇప్పుడాయన మనింటికొస్తున్నాడా!" అంది వదిన అమాయకంగా.

నేను పొట్ట చెక్కలయేట్లు నవ్వాను.

"ఏమిటే ఆడపిల్లవి కాదూ! ఆ విరగబడి నవ్వటమేమిటే"? అని అమ్మవచ్చి చివాట్లేసే వరకూ నవ్వాగలేదు.

ఆ మర్నాడు మధ్యాహ్నం వీధిలోకి వెళ్ళబోతూంటే, "మళ్ళీ వరాన్వేషణకేనా?" అంది వదిన. "ఊఁ" అంటూ చెప్పులేసుకుంటున్నాను.

"నాకేమీ తోచటంలేదు. ఇంట్లో కూర్చుందూ ఇవ్వాల్టికి" అంది.

"నీకేమమ్మా వదినా, పెళ్ళి చేసుకుని చిలకలా కులుకుతూ కూర్చున్నావ్! నా తంటాలేవో నేను పడి ఓ ఇంటిదాన్ని కావద్దూ? నీతో బాటు కూర్చుంటే ఎలా కుదురుతుంది? వస్తా, టా, టా" అంటూ నవ్వుతూనే వదినని వదిలించుకున్నాను.

ఆ రోజున అనుకున్న ప్రకారం కామేశ్వరరావు గారింటికి వెళ్లాను. ఆయన కస్టమ్స్ ఆఫీసరు. 'పాలం'లో పని. నిజాముద్దీన్‌లో ఉంటున్నారు వాళ్లు. ఆయన భార్య చాలా అందంగా ఉంటుంది. అందానికి తగ్గట్టు చక్కగా ముస్తాబు చేసుకుంటుంది. ఆవిడ చెల్లెలు నాక్లాస్‌మేట్. ఎప్పుడూ "మా కస్టమ్స్ బావ ఇవి తెచ్చాడు, మా కస్టమ్స్ బావ అవి తెచ్చాడు" అంటూ గొప్పగా చెబుతూ ఉంటుంది. బావను చూసి మరదలే అంత మురిసి పోతూంటే భార్య ఇంకెంత బడాయిలు చెప్పుకుంటుందోననీ, ఆవిడ ఎంత ఆనందంగా ఉందో విందామనీ కుతూహలం కలిగింది. వాళ్ళింటికి రమ్మని ఎన్నోసార్లు పిలిచింది నా క్లాస్‌మేట్. తను వాళ్ళక్కయ్య దగ్గరే ఉండి చదువుకుంటోంది. సరేకదా, ఇహం, పరం రెండూ కలిసొస్తాయన్నట్లు-తన కోరిక చెల్లించినట్లూ అవుతుంది, వాళ్ళక్కయ్యని వివరాలడగటానికి నాకు అవకాశమూ వస్తుందని బయలుదేరాను.

నేను వెళ్ళేసరికి నా క్లాస్‌మేట్ ఇంట్లో లేదు, షాపింగుకి వెళ్లిందిట. ఒక విధంగా సంతోషించాను లోలోపల, పైకి బాధ పడుతున్నట్లు నటించి, వాళ్ళక్కయ్యతో కబుర్లు చెప్పటం ప్రారంభించాను. కబుర్ల మధ్య అమాయకంగా అడిగాను. "ఏమండీ, అక్కయ్య గారూ, కస్టమ్స్ ఆఫీసరు జీవితం ఎలా ఉంటుందండీ! మోస్ట్ ఎక్సైటింగ్‌గా ఉంటుందను కుంటాను. అవునా?" అని.

"ఆ, మొగవాళ్ళకి ఎక్సైటింగ్‌గానే ఉండొచ్చు" అంది.

"అంటే, మీమాటేమిటి? మీకెలా ఉంటోంది ఆయన్ని పెళ్ళి చేసుకోవటం వల్ల? నాకూ ఈ మధ్య ఇలాంటి సంబంధమే వచ్చింది లెండి. అందుకని అడుగుతున్నాను" అని చిన్న అబద్ధం ఆడాను అసలు సంగతి రాబట్టాలని.

ఆవిడ అర్ధనిమీలిత నేత్రాలతో శూన్యంలోకి చూస్తూ చెప్పటం మొదలు పెట్టింది.

## కస్టమ్స్ ఆఫీసరుగారి భార్య

"అసలు మనవైపు చాలా మందికి కస్టమ్స్ అఫీషియల్ అంటే ఎవరికీ తెలియదు.

"మీ ఆయన కష్టాలాఫీసరుటకదే! ఏం కష్టాలు తీరుస్తాడే అమ్మాయ్" అంది మా బామ్మ గుండు మీద కొంగు సరి చేసుకుంటూ.

"కష్టాలు కాదు బామ్మా, 'కస్టమ్స్' అది ఇంగ్లీషు మాట" అన్నాను.

"అదేమిటే! ఇంగ్లీషు వాళ్లకి కూడా కష్టాలుంటాయిటే!" అని ఆశ్చర్యపోయింది.

"అబ్బబ్బ! అది కాదు బామ్మా 'కస్టమ్స్' అంటే అర్థం దిగుమతి ఎగుమతి వస్తువుల మీద వేసే పన్నులు అన్నమాట. విదేశాల నుంచి ఏవైనా వస్తువులు తీసుకొస్తుంటారు కదా జనం. నియమించిన దాని కన్నా ఏ మాత్రం ఎక్కువ తీసుకొచ్చినా అది నేరం కాబట్టి ఆ తీసుకొచ్చిన వస్తువుల మీద పన్ను విధించటమో, ఒక్కొక్కప్పుడు ఆ తెచ్చిన వస్తువుల్ని స్వాధీనం చేసుకోవటమో చేస్తుంది మన ప్రభుత్వం. అలాంటి వస్తువుల్ని తణిఖీ చెయ్యటమే మా ఆయన పని" అని ఆవిడకి అర్థమయ్యేట్లుగా వివరించి చెప్పాను.

'ఇదేదో కొత్త ఉద్యోగంలా ఉందేవు అమ్మాయి! మా కాలంలో ఇట్టాంటి ఉద్యోగాలు ఉండేవి కావు స్మీ! ఏదో కరిణీకం, తాసిల్దారీ, మాస్టరుగిరీ, ప్లీడరూ, డాక్టరూ, ఇలా చెప్పుకోవటమేగాని ఈ కష్టాలాఫీసరు గురించి ఎప్పుడూ వినలేదే అమ్మాయి" అంది.

ఇంకా ఏం ప్రశ్న లేస్తుందోనని అక్కణ్ణించి చల్లగా పక్కకి తప్పుకున్నాను.

కాపురానికి వెళ్లేదాకా నాకూ తెలియదు అన్ని వివరాలూ. పెళ్ళయిన కొత్తల్లో ఎన్నో ఇంపోర్టెడ్ చీరలూ, సెంట్లూ, పౌడర్లూ, లిప్‌స్టిక్‌లూ-రకరకాల వస్తువులు తెచ్చిపెడుతూ ఉండేవారు. ఆ జపాన్ నైలాన్ చీరలూ, క్రిస్టీన్‌డియోర్ సెంట్లూ, మాక్స్ ఫాక్టర్ మేకప్ సామానూ అవీ చూసి మూర్ఛపోయాను, ఆనందంతో.

"ఇవన్నీ ఎంతకి కొన్నారండీ?" అని అడిగాను-నా మీద ఆయన చూపిస్తున్న ప్రేమకి అదిరిపోతూ.

"కొనలేదు. కస్టమ్స్‌లో కొట్టేసినవి!" అన్నారు విజయగర్వంతో. కస్టమ్స్‌వాళ్ళు ప్రయాణీకుల్ని పన్నుల పేరుతో బెదరకొట్టేసి వాళ్ళు తెచ్చుకున్న విదేశీసరుకుల్ని ఎలా కొట్టేస్తూ ఉంటారో కథల్లా చెప్పారు-కాశీమజిలీ కథల్లో రాజకుమారుడి కథల్లాగ. నేను ఆ రాజకుమారుడితో కలిసి మాయ తివాసీ మీద కూర్చుని ఆకాశ వీథిలో విహరిస్తున్నట్లు ఆనందించాను.

నెలరోజులు దాటేసరికి దభీమని ఒక్కసారిగా ఈ భూమిమీదికి వచ్చిపడ్డట్లు భావన కలిగింది.

ఆయనకి నైట్ షిఫ్ట్ ఆరంభమయింది. అంతవరకూ స్పెషల్‌గా పగలు డ్యూటీ వేయించుకున్నారుట. ఇకముందు వంతులు వారీగా రాత్రి డ్యూటీ చెయ్యాలని చెప్పేసరికి నా గుండె గుభేలుమంది. రాత్రంతా ఒక్కర్తెనీ ఉండటం ఎలాగని బెంగపట్టుకుంది. ఆ బెంగకన్న బాధ కలిగించిన విషయం ఏమిటంటే ఆ నైట్ డ్యూటీ చేసొచ్చిన మర్నాడు రోజంతా కుంభకర్ణుడిలా నిద్రపోయేవారు. మొక్కుబడిగా తినటం, మళ్ళీ పడుకోవటం, నాకు పిచ్చెత్తిపోయేది. రాత్రి ఒక్కర్తెనీ పడుకోవటమేకాక, పగలు ఈ చిత్రహింస! కదిపితే చాలు కస్సుమనేవారు. పగలు డ్యూటీ వచ్చేవరకూ ప్రాణం గిజగిజలాడి పోయేది నాకు.

మధ్య మధ్య రెండేళ్ళకోసారి ఎప్పుడో అమెరికా, ఇంగ్లండు, ఫ్రాన్సు, జర్మనీ, అవీ వెళ్ళి చూసి వస్తుండేవారు. ఆయనతో నేనూ వెళ్ళాలంటే మొదట్లో చూలింత, బాలింత-ఈ గొడవలతో సరిపోయింది. పిల్లలిప్పుడు కాస్త ఎదిగారు-అనుకుంటే ఆయన నన్ను తనతో తీసుకు వెళ్ళటానికి సవాలక్ష అడ్డంకులు చెబుతారు.

"అక్కడ చలి నువ్వు భరించలేవు. ఇక్కడ చలికే పాదాలు వాచి పోయాయో అంటూ గోల పెడుతుంటావ్! అదీకాక, అక్కడకొచ్చి బంగాళ దుంపల వేపుడు కావాలి, ముక్కల పులుసు కావాలి అనుకుంటే దొరకవు. నువ్వు కోడిగుడ్డు తింటావా, చికెన్ తింటావా, చేపలు తింటావా, ఆవుమాంసం తింటావా, పంది మాంసం తింటావా, తీసికెళ్ళిన మర్నాటి నుంచీ 'ఏమండీ, ఇంటికెళ్ళి పోదాం' అని నా ప్రాణాలు తీస్తావు" అంటారు.

పోనీ ఆయనతెచ్చే జపాను నైలెక్సు, పూలీ నైలాన్ చీరలూ, ఫ్రెంచి అత్తర్లూ చూసి మురిసి పోదామా అనుకుంటే ఇప్పుడు 'మీసా' ఒకటొచ్చిపడింది-నా ప్రాణానికి.

"వెధవ నైలాన్ చీరలు, సీకోవాచీలు, టేపురికార్డర్లూ లేకపోతే సరే, కక్కుర్తి మాత్రం పడకండి. జైల్లో కూడా వేస్తారేమో కర్మ!" అని నేనే ఆయనకి ఉపదేశిస్తున్నాను. ఇంతకు ముందు ఆయన 'కొట్టేసి' తెచ్చిన చీరలు కట్టుకోవటానిక్కూడా హడిలి చస్తున్నానిప్పుడు.

అయితే, ఒక బాధ తప్పింది. మన వైపులికి వెళ్ళినప్పుడు చుట్టాలందరూ "మీ ఆయనతో చెప్పి ఓ మిక్సరు తెప్పించి పెట్టమనీ, ఓ వాచీ తెప్పించి పెట్టమనీ, మెల్‌మేక్ కప్పులు తెప్పించి పెట్టమనీ అడగటం మానేశారిప్పుడు. మాట్లాడితే 'మీసా' అంటున్నాను.!"

●●●

ఆ భ్రమ కూడా తొలిగిపోయింది నాకు ఆవిడ కథ విన్న తరవాత. "నా కన్నంలో వేలు పెడితే నేను కుట్టనా!" అందిట చీమ. ఆ కష్టమ్స్ వాణ్ణి పెళ్ళి చేసుకోవటమెందుకు? ఆ కష్టాలన్నీ కొని తెచ్చుకోవటమెందుకు? నా లిస్టులోంచి అతన్ని కొట్టిపారేశాను అప్పటికప్పుడు. కొంత బరువు తీరినట్లయింది.

బస్సులో తిరిగి వస్తూంటే వాల్ పోస్టర్ ఎడ్వర్టైజ్‌మెంట్ కనిపించింది ఒక చోట. అయిమాక్స్‌లో చంద్రమోహన్ చిత్రాలు వన్‌మాన్ ఎగ్జిబిషన్ ఉందిట. అతను ఎగ్జిబిషన్‌లో బిజీగా ఉండి ఉంటాడు. అతని భార్య ఇంట్లోనే ఉండి ఉంటుంది. బస్సులోంచి మధ్యలో దిగిపోయి బెంగాలీ మార్కెట్ వైపు నడిచి వెళ్ళాను. చంద్రమోహన్ మా వదిన వైపు చుట్టం. అప్పుడప్పుడు వదినతో కలిసి వాళ్ళింటికి వెళ్ళాను. ఆ ధైర్యంతో ఒక్కర్తైనీ వెళ్ళి వాళ్ళ తలుపు తట్టాను. నా అదృష్టంకొద్దీ ఆవిడ ఇంట్లోనే ఉంది. ఇలాంటి సుందరి భార్యగా లభించడం వల్లనే అతను ఆర్టిస్టు అయాడేమో ననిపించింది ఆవిణ్ణి చూడగానే. కళ్ళు చెదిరే అందం కాదావిడది. కలువ పువ్వులా ఉంటుంది. నన్ను ఆదరంగా లోపలికి ఆహ్వానించింది.

వాళ్ళ ఇల్లు సింపుల్‌గా ఉన్నా ఎంతో కళాత్మకంగా ఉంది. ఉన్న వస్తువులన్నీ ఆర్టిస్టిక్‌గా ఉన్నాయి. యాష్‌ట్రే దగ్గర నుంచి ప్రతి వస్తువూ విశిష్టంగా ఉంది. మానస సరోవరంలో ప్రవేశించినట్లుగా ఉంది మనస్సుకి హాయిగా. లైట్‌గా టీ తయారు చేసి ఇచ్చింది. మొహమాటపడుతూనే తీసుకున్నాను.

"మీవారి చిత్ర ప్రదర్శనకి మీరు వెళ్ళలేదే!" అన్నాను సంభాషణకి ఉపక్రమిస్తూ.

"మొదటి రోజున వెళ్ళాను ఆయనతో కలిసి. ఇవ్వాళ మూడోరోజు. రోజూ ఎందుకూ ఆ వచ్చే పోయే వాళ్ళ మధ్య" అంది.

నా మనస్సులో మాట ఎలా బయట పెట్టాలో తెలియలేదు. ఆవిడ దగ్గర అంత చనువు లేదునాకు. మొండిగా వచ్చాను గాని ఎలా మొదలు పెట్టాలో అర్థం కాలేదు.

ఆవిడే ఏంతోచక అడిగింది "చదువయాక ఏం చేస్తావ్"? అని.

మునిగిపోయే వాడికి పడవ దొరికి నట్లయింది నాకు. సిగ్గుపడుతూ చెప్పాను "మా వాళ్ళు పెళ్ళి చెయ్యాలని శతవిధాల ప్రయత్నిస్తున్నారు. నాకు రీసెర్చి చెయ్యాలని ఉంది" అన్నాను.

"సంబంధాలు చూస్తున్నారా? ఏమన్నా కుదిరిందా?" అంది.

"లేదండీ, మా నాన్నగారు తెచ్చిన సంబంధం ఒక్కటీ నాకు నచ్చలేదు. నేనే వెతుక్కుంటున్నాను ఇప్పుడు" అన్నాను చిరునవ్వు నవ్వుతూ.

నేను జోకు వేశాననుకుని ఆవిడ పకపకా నవ్వింది. నిజంగా వెతుక్కుంటున్నానని చెప్పినా నమ్మేట్లు లేదావిడ. అసలు విషయానికి ఎలారాను?

ఆలోచిస్తున్నాను. ఆవిడ కూడా మౌనంగా కూర్చుంది ఆలోచిస్తున్నట్లు.

"మావాళ్ళ కుర్రాడొకడున్నాడు! చూస్తావా?" అంది ఉన్నట్టుండి.

"అతనూ మీవారి లాగ చిత్రకారుడేనా?" అన్నాను.

"అబ్బెబ్బె! కాదు. అతనిది నిక్షేపంలాంటి బ్యాంక్ ఉద్యోగం" అంది.

"అదేమిటండీ, ఆర్టిస్టుకేం లోటు! అందులోనూ మీలాంటి జోడీ దొరికిందంటే!" అన్నాను.

"అయ్యో, నీకింకా తెలియదల్లే ఉంది! ఆర్టిస్టు వేసే చిత్రాల్లా అందంగా ఉంటుందనుకున్నావా అతని జీవితం కూడా? ఆర్టిస్టు మాట ఎలా ఉన్నా ఆర్టిస్టు భార్య కావటం మాత్రం అంత అదృష్టకరం ఏమీ కాదు" అంది.

"మీరు మరీ అన్యాయంగా మాట్లాడుతున్నారండీ" అన్నాను. ఆవిణ్ణి ఆ విధంగా రెచ్చగొడితే అసలు కథ బయటి కొస్తుంది కదా అని. అనుకున్నంతా అయింది. ఇక నేను ఆపుదామన్నా ఆగేట్టులేదావిడ. ఆరంభించింది ఆవిడ అనుభవాలు చెప్పటం.

**ఆర్టిస్టుగారి భార్య**

"ఆయన నేషనల్ మ్యూజియమ్‌లో అసిస్టెంటుగా పనిచేస్తున్నారు. అసలు ఆయన నేర్చుకున్నది చిత్రలేఖనం. పెళ్ళికి ముందు ఆయన గీసిన చిత్రాలు చూసేందుకు నాకు అవకాశం లేక పోయింది. మా ఇంట్లో చిత్రలేఖనం వంటి కళల మీద అట్టే అభిరుచి లేదు ఎవరికీ. నాకు కాబోయే భర్త చిత్రకారుడని తెలియగానే ఎంతో ఉవ్విళ్ళూరాను. ఆయన చేత నా బొమ్మలు కావలసినన్ని వేయించుకోవచ్చునని.

సొంత ఇంట్లో కాపురం పెట్టిన మర్నాడు ముచ్చటగా అడిగాను 'ఏమండీ నా బొమ్మగియ్యరూ?" అని. సరేలే, సరేలే అంటూ నానుస్తూ వచ్చారు. ఏదో ఆఫీసు పని హడావిడిలో ఉన్నారులే అని సరిపెట్టుకున్నాను. ఓ రోజు స్నానం చేసి చీర చుట్టబెట్టుకుని ఇవతలికి వస్తూంటే 'ఇదుగో నీ బొమ్మ' అంటూ ఇచ్చారు. ఆ బొమ్మ చూడగానే సిగ్గుతో ముడుచుకుపోయాను.

"మీరెలా చూశారు!" అన్నాను.

"మన అదృష్టం కొద్దీ దేవిగారివ్వాళ బాత్ రూమ్ తలుపు వేసుకోవటం మరిచి పోయారు!" అన్నారు.

"ఛీ, పాడుబుద్ధి" అన్నాను సరసంగా మందలిస్తూ.

"ఇంతకీ నీకు నచ్చిందా లేదా?" అన్నారు నన్ను దగ్గరికి లాగుతూ.

"ఛీ, ఇదేం పాడు బొమ్మ! ఒంటి మీద బట్టలేకుండా! స్నానం చేసేటప్పుడే మీకు టైము దొరికిందా బొమ్మవెయ్యటానికి? ఇంకా ఎప్పుడో బొమ్మ వెయ్యటానికి నన్ను పిలుస్తారనీ, అప్పుడు నా బెనారస్ పట్టుచీర-పెద్దబోర్డరుది-కట్టుకొని నగలన్నీ పెట్టుకొని

అజంతా సిగ చుట్టుకొని బొమ్మవేయించుకుందామనుకున్నాను. చెప్పాచెయ్యకుండా ఇదేంపని! దీన్ని నలుగురికీ ఎలా చూపిస్తాను? మనకోసమే అయితే బొమ్మ గీసుకోవటం కూడా ఎందుకు?" అంటూ నా నిరుత్సాహాన్నంతా వెల్లడించాను.

ఆయన అదేం పట్టించుకోకుండా ఆ బొమ్మకి మెరుగులు దిద్దడం మొదలు పెట్టారు.

ఆయన వేసిన బొమ్మలన్నీ అంతవరకు నేను చూడలేదు. చూడాలనే కుతూహలం కలిగిందప్పుడు. ఆయన చిత్రించినది ఒకే ఒక చిత్రం గోడకి తగిలించి ఉంది. అందులో మేఘాలూ పర్వతాలూ లోయలూ వాటిల్లో ఆడవాళ్ళ రూపాలూ అంతా అల్లిబిల్లిగా గమ్మత్తుగా ఉంది.

"ఏమండీ, మీ తక్కిన చిత్రాలు కూడా చూపించండి" అన్నాను.

"ఏం లాభం. నేవేసిన చిత్రం నీకు నచ్చలేదుగదా!" అన్నారు.

"ఎలా నచ్చుతుంది మరి. చక్కగా బట్టలూ నగలూ ఉండగా వేస్తే ఎంత బాగుండేది!" అన్నాను.

"ఇందులో ఉన్న అందం ఇంకెందులోనూ రాదు" అన్నారు. నగ్న చిత్రం మీద వేలుతోరాస్తూ.

"అలా అయితే వీధి గదిలో వేళ్ళాడదియ్యండి" అన్నాను. ఆయన ఏం మాట్లాడకుండా వెళ్ళి పెద్ద ట్రంకుపెట్టెలో పెట్టిన పాత చిత్రాలు తీయటం మొదలుపెట్టారు నాకు చూపించటానికి.

ఒక్కొక్క చిత్రమే చూస్తున్న కొద్దీ నాకు మతిపోయింది. అన్నీ నగ్నస్త్రీల చిత్రాలే. ఇంకా నా చిత్రంలో అన్ని వివరాలు లేవు. ఏదో అవుట్ లైన్‌లో గబగబా వేసినట్టున్నారు. ఆ చిత్రాలు అలా లేవు నిజంగా నగ్నంగా ఆడవాళ్ళు మనముందు నిలబడినంత సహజంగా ఉన్నాయి.

"ఈ ఆడవాళ్ల నందర్నీ ఎక్కడ చూశారు?" అని అడిగాను నిర్ఘాంతపోయి.

"వీళ్ళంతామోడల్స్–నేను ట్రెయినింగ్ అవుతున్నప్పుడు మా ఇన్‌స్టిట్యూట్‌కి వచ్చేవారు" అన్నారు.

"ఏమిటి! వీళ్ళంతా ఇలా బట్టలు విప్పుకొని పోజులిస్తూ సిగ్గులేకుండా మీ ఎదురుగా నిలబడ్డారా? మీరు వాళ్ళని చూస్తూ బొమ్మగీశారా?" నమ్మలేనట్లుగా అడిగాను.

"అవునూ" అన్నారాయన శ్రీకృష్ణ పరమాత్ముడిలా చిద్విలాసంతో.

"వీళ్ళంతా భోగం వాళ్ళా!" అని అడిగాను ఒక వేళ ఆ రోగాలన్నీ ఆయనకి అంటుకున్నాయేమో నన్నంత భయంతో.

"ఛీ, అటువంటి వాళ్ళు కాదు. వీళ్ళలో కొంతమంది బీదవాళ్లు, కూలిజనం, కొంతమంది ప్రొఫెషనల్ మోడల్స్, అలా నగ్నంగా నిలబడ్డం, కూర్చోవడమే వాళ్ళ ఉద్యోగం" అన్నారు.

"వాళ్ళని చూసి నిగ్రహం చూపించగలిగారా మీరు?" అని అడిగాను.

"చిత్రం గీస్తున్నప్పుడు అటువంటి చపలచిత్తమే కలగదు. చిత్రిస్తూన్న విషయంమీద తదేకధ్యానం లేకపోతే చక్కగా గియ్యటం సాధ్యం కాదు. చిత్రం గీసిన తరవాత వాళ్ళెవరో, మనమెవరమో. ఇచ్చిన డబ్బు తీసుకుని వెళ్ళిపోతారు వాళ్ళదారిన వాళ్ళు" అని వివరించారాయన.

కానీ, నాకెందుకో మనస్సుకి తృప్తి కలగలేదు. ఆయన అంతమంది ఆడవాళ్ళని నగ్నంగా చిత్రించి ప్రవరాఖ్యుడిలా ఉండి పోయారంటే నమ్మబుద్ధి కాలేదు.

"ఈ మధ్య ఇలాంటి చిత్రాలు గియ్యటం మానేశారా?" అని అడిగాను ఆశగా.. జరిగిందేదో జరిగిపోయిందిలే, ఇకముందైనా జాగ్రత్తపడితే మంచిదని.

"మానెయ్యలేదు. కానీ, ఇది చాలా ఖర్చయ్యే వ్యవహారం. ముందు మంచి మోడల్స్ దొరకటం కష్టం. దొరికితే వాళ్ళకి కావలసినంత డబ్బు ఇవ్వటం కష్టం. ఇప్పుడు నువ్వొచ్చావుగా! నీ బొమ్మలు గీస్తాను" అన్నారు.

"ఛీ, ఇంకా నయం! నా బొమ్మలు ఇలా నగ్నంగా గీసి ఊళ్ళో వాళ్ళకి అమ్మాలను కుంటున్నారా? మీకు లేకపోతే సిగ్గు నాకైనా లేదనుకున్నారా?" అని ఖండించాను. ఆయన మౌనంగా ఉండిపోయారు.

నా మాటలికి చిన్నబుచ్చుకున్నారేమో! నిరుత్సాహ పరుస్తున్నానని భావిస్తున్నారేమోనని అనుమానం వేసింది. "పోనీ, చెట్లూ చేమలూ ఉన్న చిత్రాలు వెయ్యకూడదూ? లేకపోతే, అదేదో అర్థంకాని ఆర్టుంటుంది. చూడండి-మోడర్న్ ఆర్ట్ అంటారే-అలాంటి బొమ్మలు వెయ్యకూడదూ?" అన్నాను ఆయన్ని ప్రోత్సాహపరచాలనే ఉద్దేశంతో.

ఆయన చిరునవ్వు నవ్వి ఊరుకున్నారు. నా మాటల్ని చిన్నపిల్ల మాటలుగా కొట్టిపారేసినట్లుంది ఆ చిరునవ్వు. సరే, నా కెందుకులే అని ఊరుకున్నాను.

ఓ రోజున ఆఫీసు నుంచి ఆయనతో వచ్చిన మనిషిని చూసి పిడుగుపడ్డట్లు ఝుడుసుకున్నాను. నల్లగా ఉన్నా, పొంగే వయస్సుతో పిట పిటలాడుతూ, చక్కని కనుముక్కు తీరుతో నా కళ్ళే చెదిరేటట్లుగా ఉంది ఆ మనిషి. కానీ నాలుగు రోజుల నుంచి తిండి లేనట్లుగా నీరసంగా ఉంది ముఖం. జుట్టు రేగిపోయి బట్టలు మాసిపోయి పీలికలై బికారిలా ఉంది.

"దీన్నెందుకు తెచ్చారు?" అన్నాను అనుమానంగా చూస్తూ.

"బొమ్మగీద్దామని" అన్నారు యథాలాపంగా.

నేనుభయపడినంతా అయింది. పెళ్ళయింది కదా, ఇంట్లో చెట్టంత పెళ్ళాం ఉందని కూడా లెక్కచెయ్యకుండా ఇంటికే తీసుకొస్తారా! ఇప్పుడు దీన్ని బట్టలు విప్పి కూర్చోబెట్టి తీరిగ్గా బొమ్మగీస్తారా? అమ్మ నాయనోయ్! రక్షించు తండ్రీ! వెంకటేశ్వరస్వామీ! నన్ను రక్షించు-అని మొరపెట్టుకున్నాను.

నా ఆలోచనలను చిన్నాభిన్నం చేస్తూ ఆయన "పాపం, దానికి ఆకలిగా ఉందిట. ముందేదైనా పెట్టు" అన్నారు.

"ఆ, దాని ఆకలి నేను తీరుస్తాను, ఆ తరవాత రాత్రి అది మీ ఆకలి తీరుస్తుందా" అని అడుగుదామనుకున్నాను. కానీ ధైర్యం చాల్లేదు. ముఖం మాత్రం ముడుచుకుని, నేను చేసి ఉంచిన ఉప్మా దానికి ఒక ఆకులో పెట్టి ఇచ్చాను. ఆవురావురుమని క్షణంలో తినేసింది. జాలేసి, నా కోసం అట్టే పెట్టుకున్న వాటా కూడా దానికే పెట్టేశాను. గ్లాసుడు నీళ్ళిచ్చాను. తాగి, నాకేసితృప్తిగాచూసి, హఠాత్తుగా నా పాదాలు కళ్ళకద్దుకుంది.

ఆయన టిఫిన్ తింటూంటే పక్కనకూర్చుని "ఏమండీ, నా మాటవిని దానిచేత బట్టలు విప్పించకండీ" అంటూ బ్రతిమాలాను.

"పిచ్చిదానా, అంత భయపడతావెందుకు? బంగారు సీతలాంటి నిన్ను వొదులుకొని ఆ శూర్పణఖ వెంటపడతాననుకున్నావా? బొమ్మ గియ్యటం సంగతి వేరు. దాని లైన్స్ బావున్నాయని ఆశపడి, దాని దారిద్ర్యంతో బేరమాడి తీసుకొచ్చాను. దాన్ని సురక్షితంగా పంపేస్తాను. నువ్వు నిశ్చింతగా ఉండు" అన్నారు.

ఆయన కాఫీ టిఫినూ అయాక ఆయన వర్క్‌షాపులా ఉపయోగిస్తున్న మూలగదిలోకి తీసుకువెళ్లారు. నేను చేసేదేంలేక దేవుణ్ణి తలుచుకుంటూ వంటింట్లోకి వెళ్లాను."

●●●

ఆవిడ దగ్గర వీడ్కోలు తీసుకుని ఇంటికి వస్తూ, దారిలో ఆవిణ్ణి తలుచుకుంటూ అలాంటి లంపటంలో ఇరుక్కుంటే కష్టంబాబూ! నిత్యం సత్యభామలా చిటపటమంటూ జీవితం సాగించాలంటే నావల్లకాదు. మైడియర్ ఆర్టిస్ట్! బైబై? అనుకున్నాను.

ఇంటికి నీరసంగా తిరిగి వచ్చాను. వెళ్ళిన రెండు కేసులూ బెడిసి కొట్టి నిరాశమాత్రం మిగిలింది.

"ఏం, మైడియర్ షేక్స్‌పియర్" అంది వదిన నా వాలకం చూసి, నేను మాట్లాడకుండా ఉస్సురంటూ వాలు కుర్చీలో కూలపడ్డాను.

"ఎంత వరకూ వచ్చింది నీ వరాన్వేషణ" అంది తనుకూడా ఒక మోడా మీద చతికిలబడి.

చేతిలో మడతలు పడి ఉన్న కాగితాన్ని వదిన చేతికి అందించాను మౌనంగా. వదిన మడత విప్పి నా ఉద్యోగస్తుల లిస్టు చూసి, "ఏమిటి! శ్రీవార్లందరికి వరసగా సున్నాలు చుట్టేస్తున్నావ్!" అంది.

"ఏమిటో వదినా! ఏ ఉద్యోగి చరిత్రవిన్నా 'ఏమున్నది గర్వకారణం' అనిపిస్తోంది. ఆడవాళ్ళలో ఇంత అసంతృప్తి పేరుకుపోయి ఉందని నేను కల్లో కూడా ఊహించలేదు. నాకు దారీతెన్నూ కనిపించటం లేదు" అన్నాను.

వదిన మందహాసం చేసింది. 'లాఫింగ్‌బుద్ధా' బొమ్మ గుర్తుకొచ్చింది నాకు. "ఏమిటి వదినా, నీకు మరీ నవ్వులాటగా ఉంది నన్ను చూస్తే" అన్నాను.

"అది కాదు వసంతా, కేవలం ఉద్యోగం వల్లనే జీవితం సుఖప్రదం అవుతుందనే భ్రమతో నువ్వు నీ ప్రయత్నాలు ప్రారంభించావు. నీ ప్రాతిపదికే నిరాధారమైనదని నీకింకా తెలియటం లేదు" అంది – చిన్నప్పుడు క్లాసులో మా కమలా టీచర్ పాఠం చెప్పినట్లు.

నేను కూడా శ్రద్ధగా వినే విద్యార్థినిలా నిటాగ్గా కూర్చుని "చెప్పు" అన్నాను.

"మా సంగతే తీసుకో ఉదాహరణకి. మీ అన్నయ్య 'లాబ్స్'లోనే ఆయనతో పాటు పని చేసే మరొక సైంటిస్టు ఉన్నాడు. చంద్రశేఖర్ అని, ఇద్దరూ ఇంచుమించు ఒకేరకం ఉద్యోగాలు ఒకేచోట చేస్తున్నారు. ఆ చంద్రశేఖర్‌గారు ప్రతి సంవత్సరం సెలవుపెట్టి పెళ్లాన్నీ పిల్లల్నీ తీసుకొని సిమ్లా, ముస్సోరీ, మనాలీ, కులూ ఇలా ఏదో ఒక హిల్ స్టేషనుకి వెడుతుంటారు. హాయిగా విహరించి విశ్రాంతి తీసుకొని వస్తుంటారు. మీ అన్నయ్య చూడు! ఒక్కపూట సెలవు పెట్టినా సరే ఆఫీసులో పనులన్నీ ఆగిపోతాయన్నట్టూ, ఈయన భుజస్కంధాల మీదే ఆ లాబరేటరీస్ నిలబడ్డట్లు గానూ ఊ ఇదై పోతారు! నెల రోజులు ఎక్కడికైనా సెలవు పెట్టి సరదాగా తిరిగొద్దామని చెబితే, 'క్రిమినల్ వేస్ట్ ఆఫ్ టైమ్' అంటారు. అలా అని పని చెయ్యటం వల్ల ఆయనకి 'పద్మశ్రీ' ఏమైనా వస్తుందేమో నాకు తెలియదు కాని, నేను మాత్రం వంటశ్రీలా ఇంట్లోనే పడి ఉండటం తప్పదు.

ఇంతకీ చెప్పొచ్చేదేమిటంటే, ఉద్యోగాన్ని బట్టికాదు జీవితం సుఖమయం అయేది. మనుషుల మనస్తత్వాలూ, తీరులూ బట్టి ఉంటుందని నా ఉద్దేశం.

ఏరాయి అయితేనేం పళ్ళూడగొట్టుకోవటానికి అన్నట్టు! ఏ ఉద్యోగం అయినా మనిషి తత్త్వం బట్టి మనం మసులుకోక తప్పదు, అవునంటావా?" అంది వదిన.

"ఏమో, వదినా, నాకు చెడ్డభయంగా ఉంది పెళ్ళిచేసుకోవాలంటే. చూస్తూ చూస్తూ అడుసులో కాలువేస్తానేమోనని భయంగా ఉంది" అన్నాను.

"అడుసులో కాలు వేసినా వెయ్యకపోయినా, మాకందరికీ పప్పన్నం పెట్టేలోపునే నువ్వు పప్పులో కాలేస్తావేమోనని నా భయం" అంది వదిన నవ్వుతూ.

ఆ రాత్రి కలత నిద్రతో బాధపడ్డాను. పెళ్ళికొడుకులందరూ రాక్షస రూపాల్లో వచ్చి కుర్చీల్లో కూర్చుని వికటాట్టహాసం చేస్తూంటే నేను కళ్ళూ, చెవులూ మూసుకొని 'పొండి, మీరంతా పొండి' అని వెర్రిగా అరుస్తున్నట్లు కలొచ్చింది.

ఆ మర్నాడు నా పథకం ప్రకారం పైలట్ ఆఫీసరు గారి భార్యతో మాట్లాడటానికి వెళ్ళాలి. వెడదామా మానదామా అని తర్జన భర్జన చేసుకుంటున్న సమయంలో పోస్ట్‌మాన్ వచ్చి ఉత్తరాలు ఇచ్చి వెళ్ళాడు. అందులో ఒకటి అమెరికా నుంచి వచ్చింది. ఎవరి దగ్గర నుంచి చెప్మా అని ఆశ్చర్యపోతూ నాన్నగారి చేతికిచ్చాను.

నాన్నగారు కూడా తెల్లబోతూ కవరు విప్పారు. లోపలున్న ఉత్తరం తీసి చదువుతూ "ఏమేవ్!" అన్నారు ఉత్సాహంగా.

"ఏమిటండీ" అంది అమ్మ కుతూహలంగా.

"రాజు ఉత్తరం రాశాడే!" అన్నారు చదువుతూనే. "రాజు రాశాడా!" అని అమ్మా నేనూ కూడా ఒకేసారి ఆశ్చర్యపోతూ అన్నాం.

"ఆఁ, రిసెర్చి పూర్తిచేశాడట. అక్కడే ఏదో ఉద్యోగంలో స్థిరపడ్డాడుట. ఇక్కడికి నెలరోజుల సెలవుమీద వస్తున్నాడుట" అన్నారు.

నాన్నగారి గొంతులో అంత సంతోషం ధ్వనించటం ఈ గడిచిన నాలుగైదు సంవత్సరాల్లోనూ నేనెప్పుడూ చూడలేదు. రాజు పేరెత్తితేనే ముఖం ముడుచుకునేవారు. అతను అమెరికా వెళ్ళిన కొత్తలో రెండుమూడు ఉత్తరాలు రాశాడు. చదవకుండానే చింపి అవతల పారేశారు. అప్పటి నుంచీ 'రాజు' అన్న పదం మా ఇంట్లో ఎప్పుడూ వినిపించలేదు. రాజు అమెరికా వెళ్ళకముందు జరిగిన గొడవమూలాన్ని అందరి మనస్సులూ విరిగిపోయి అందరం అతనికి విముఖులై పోయాం.

ఏం జరిగిందంటే, ఓ రోజు రాత్రి భోజనాలు చేస్తూండగా నాన్నగారు "ముహూర్తం ఎప్పుడు పెట్టించమంటావురా" అన్నారు.

"దేనికి" అన్నాడు, రాజు అన్నం కలుపుకోవటం ఆపేసి.

"ఇంకా దేనికనుకున్నావ్! తమరి చేత మూడుముళ్లూ వేయించటానికి' అన్నారు.

'ఇప్పుడే తొందరేముంది మామయ్యా!" అన్నాడు రాజు తినబోతున్న ముద్ద చిదిపేస్తూ.

"ఇప్పుడే అంటే ఈ రాత్రి చేస్తామనుకున్నావేమిటోయ్!" అన్నారు నాన్నగారు పరిహాసంగా.

నేను కిసుక్కున నవ్వాను నోట్లో ముద్దపెట్టుకుని. అక్కయ్య సిగ్గుపడిపోతూ అన్నం ముద్దని నోట్లోపెట్టుకోకుండా పదేపదే ఉండచేస్తోంది. అమ్మ వడ్డనచేస్తూ అందరివైపూ ఆసక్తిగా చూస్తోంది.

"అది కాదు మామయ్యా. స్కాలర్‌షిప్ సంపాదించి పి. హెచ్‌డి. చెయ్యాలని ఉంది. ఇప్పటి నుంచీ పెళ్ళిచేసుకుని కాపురం పెడితే..." అంటూ నసిగాడు.

అక్కయ్య కంచంలో చెయ్యికడుక్కుని లేచిపోయింది బావచెప్పేది పూర్తికాకుండానే.

"ఎదిగిన పిల్లని ఎన్నాళ్ళని అలా ఉంచితే బావుంటుందయ్యా" అంది అమ్మ.

"పోనీ, ఆ మూడుముళ్ళూ పడితే అసలు కార్యం నీ ఇష్టం వచ్చినప్పుడు జరిపించవచ్చును కదా" అన్నారు నాన్నగారు. రాజు ఏమీ సమాధానం చెప్పకుండా మంచినీళ్ళు తాగాడు.

"అబ్బే, అలా ఎలా కుదురుతుందండీ! ఇంట్లో కలిసి మెలిసీ తిరుగుతున్నప్పుడు రేపేదైనా అయిందంటే నలుగురూ మొహాన పేడ నీళ్ళు జల్లుతారు" అంటూ నాన్నగారి ప్రతిపాదనని ఖండించింది అమ్మ.

నాన్నగారు సాలోచనగా ఉండిపోయారు. నేను రాజువైపుచూశాను ఏమాలోచిస్తున్నాడో గ్రహించటానికి వీలుంటుందేమోనని. రాజు తలెత్తి నాకేసిచూశాడు నిశ్చలంగా. అలా ఎందుకు చూస్తున్నాడో అర్థంకాక నేను రాజు ముఖాన్నే చూస్తూ ఉండిపోయాను.

రాజు తలవంచుకుని "వసంతనైతే చేసుకుంటాను. నాకు మంచి ఉద్యోగం దొరికేవరకూ వసంతకి తొందరలేదు కాబట్టి" అన్నాడు.

రాజుకేసి చురచుర చూశాను. రాజు తలెత్తి చిరునవ్వు నవ్వాడు కళ్ళతోనే. నాన్నగారూ అమ్మా ఒకరి నొకరు చూసుకున్నారు క్షణంసేపు – ఈ ఆకస్మిక పరిణామాన్ని ఎలా తీసుకోవాలో అర్థంకానట్లు.

చివరికి నాన్నగారే అన్నారు "సరే, నీఇష్టం, దానిష్టం" అని. నాన్నగారి ముఖంలో ప్రసన్నత మాయమైంది, మాటలు సరళంగా ఉన్నా. అమ్మ వంటింట్లోకి వెళ్ళిపోయింది. నేను లేచి పెరట్లోకి వెళ్ళాను. చెయ్యి కడుక్కుందామని, వెడుతూ ఉంటే భోజనాల గది వెనకాల తలుపుచాటు నుంచి అక్క అప్పుడే ఇవతలకి వచ్చింది. విన్నదన్నమాట.

రాత్రి ఎంతకీ పక్కమీదకి రాకపోయేసరికి ఇల్లంతా వెతికి చివరికి డాబామీదకి వెళ్ళాను. పిట్టగోడను ఆనుకుని ఓ మూలనుంచుని ఉంది అక్క. దగ్గరగా వెళ్ళి భుజం మీద చెయ్యివేశాను. ఉలిక్కిపడి బుగ్గలు తుడుచుకుంది. నాకు జాలివేసింది. ఏమని సముదాయించాలో తెలియక దాని వెనకాతల మౌనంగా నిలబడిపోయాను. హఠాత్తుగా వెనక్కి తిరిగింది అక్క.

"బావని చేసుకుంటావా?" అని అడిగింది. గొంతు గాద్గదికంగా ఉంది. ఆ ప్రశ్న అడిగే తీరు నా సమాధానాన్ని తెలుసుకుందామన్నట్లుగా లేదు. "బావని చేసుకోననవే" అని జాలిగా అడుగుతున్నట్లు అనిపించింది.

"ఛీ, నేను చేసుకోను" అన్నాను తక్కుమని. అక్క ముఖం మీద చిరునవ్వు స్పష్టంగా కనిపించింది. ఆ చిరునవ్వుచూస్తే నా కెంతో గర్వం కలిగింది. ఆ క్షణంలో అక్కకన్న నేనెంతో పెద్దదాన్నయినట్లూ, దాని కోరిక తీర్చగలిగిన ఘనత నాదేన్నట్లూ, భావన కలిగింది.

"రావే, కిందికి, ఇక్కడ చలేస్తోంది" అని, దాని నడుం చుట్టూ చెయ్యివేసి కిందికి తీసుకువెళ్లాను.

గతమంతా నా మనస్సులో మెదిలింది. రాజు వస్తున్నాడంటే నాకు కొంచెం చిరాకువేసింది. ప్రశాంతంగా ఉన్న నీళ్ళలో రాయిపడినట్లు కలత చెందింది నా మనస్సు. అక్కయ్య కూడా పురిటికి వచ్చేరోజులు. ఇద్దరూ ఒకేసారి ఇక్కడికి రావటం ఏం బావుంటుంది? మధ్యలో నేను.

నా మనస్సులో చికాకుని తొలిగించుకోవటానికీ, నా మనస్సుని రంజింప చేసుకోవటానికీ నేను ప్రారంభించిన వరాన్వేషణ కార్యక్రమం కొనసాగించటం తప్ప మరో మార్గం కనిపించలేదు.

కానీ, నా పథకం ప్రకారం పైలట్ ఆఫీసరు గారింటికి వెళ్లాలంటే 'పాలం' దగ్గరికి వెళ్లాలి. మరీ దూరం, ఈ మానసిక స్థితిలో అంత దూరం వెళ్ళాలనిపించలేదు. నా లిస్టులో పైలట్ తరువాత చేర్చిన పి.ఆర్.వో గారింటికి వెళ్ళాలని నిశ్చయించుకున్నాను. అతనూ అతని భార్యా కూడా చాలా సరదాగా ఉంటారు. అతను మా అన్నయ్యకి చిన్నప్పటి క్లాస్ ఫెలోట. తరుచు భార్యని తీసుకుని వస్తూంటాడు మా ఇంటికి మా అన్నయ్య ఉన్నా లేకపోయినా. నాన్నగారు కూడా అతను వస్తే సంతోషిస్తారు కులాసాగా కబుర్లు చెబుతాడని. అన్నయ్యకి నాన్నగారితో మాట్లాడటానికి తీరికుండదు. అందుచేత పి.ఆర్.వో. ప్రకాశరావు వస్తే నాన్నగారి ముఖం కూడా ప్రకాశిస్తుంది. అతని భార్య పేరు ప్రభావతి. భార్యాభర్తలిద్దరూ సరదాగా మాట్లాడతారు. వాళ్ళతో కూర్చుంటే గంటలు క్షణాల్లా గడిచిపోతాయి. వాళ్ళు నిజంగా 'మేడ్ ఫర్ ఈచదర్' లాగ అన్యోన్యంగా ఉంటారు. నా లిస్టులో ఒక్క జంట అయినా అన్యోన్యంగా ఉండే వాళ్ళు దొరికినందుకు సంతోషించి ఉత్సాహంగా ముందుకిసాగాను.

నేనువెళ్ళేసరికి ఆవిడ ఏదో అల్లుకుంటూ కూర్చుంది. పిల్లలు ఆడుకోవటానికి వెళ్ళారుట. ఆవిడ దగ్గర నాకెటువంటి మొహమాటం లేదు కాబట్టి వెళ్లినపని సూటిగా చెప్పేశాను. 'చంపావుపో!' అంది.

నేను కుదేలైపోయాను. "ఏమండీ, ఏం?" అన్నాను బిక్కమొహం వేసుకుని.

"అవునుమరి! నేననుభవిస్తున్నది చాలక నీకూ రికమెండ్ చెయ్యమన్నావా అమ్మా మావారిలాంటి మహాపురుషుణ్ణి!" అంది నవ్వుతూ.

ఆవిడ వేళాకోళంచేస్తోందనీ, నిజంగా ఆవిడికి భర్తమీద ఎటువంటి ఫిర్యాదూ లేదనీ నాకు నేను నచ్చజెప్పుకున్నాను.

"మావారి సంగతి నీకు తెలుసుననుకున్నానే!" అంది.

"తెలియడమంటే సరదాగా ఉంటారని తెలుసు" అన్నాను జాగ్రత్తగా ఆలోచించి.

"ఆయన ఉద్యోగం సంగతి నేననేది. తెలియదేమోలే నీకు చెబుతా విను" అని మొదలు పెట్టింది.

**పి.ఆర్.ఓ. గారి భార్య**

"నేను పెళ్ళయిన కొత్తలో పండక్కి పుట్టింటికి వెళ్ళినప్పుడు మాపని మనిషి నా బట్టలుతుకుతూ, "సిన్నమ్మాయిగోరూ, మీ ఆయనగోరి ఉద్యోగం ఏటండీ?" అని అడిగింది. పి.ఆర్.వో. అంటే దానికేం తెలుస్తుందని "చాలా పెద్ద ఉద్యోగంలే" అన్నాను.

"అంటే కలకటేరాండీ" అంది.

"కాదే, గవర్నమెంటులో పెద్ద పెద్ద వాళ్ళందరితోనూ మాట్లాడి వ్యవహారాలు నడపాలి. మంత్రులూ వాళ్లూ అందరూ తెలుసాయనకు' అన్నాను అంతకన్న ఎలా చెప్పాలో తెలియక.

ఆ మర్నాటినుంచీ చుట్టుపక్కల వాళ్ళు అందరూ ఒక్కొక్కళ్ళే వచ్చి అమ్మాయిగారూ, మీవారికి మినిస్టర్లతో స్నేహంట. గవర్నమెంటులో పెద్ద పెద్ద వాళ్ళంతా మీ వారు ఏది చెబితే అది చేస్తారట. మావాడి కేదన్నా నౌకరీ ఇప్పించేట్టు చూడండి మీకు పుణ్యం ఉంటుంది అంటూ రకరకాల అభ్యర్థనలు తీసుకొచ్చారు. నాకు తలగిర్రున తిరిగింది. ఎరక్కపోయి గొప్పలు చెప్పానే పనిమనిషి ముందర! ఇప్పుడు వీళ్ళందర్నీ ఎలా తప్పించుకోవటమా అని మథనపడ్డాను. వాళ్ళు అంతగా వేడుకుంటూంటే అప్పటిమట్టుకు "సరే, ప్రయత్నించి చూస్తానులెండి" అన్నాను.

"మీరు ప్రయత్నిస్తానంటే కాదు. మాకు తెలుసు. మీవారు చెయ్యలేని పనంటూలేదు. మీరు ఆయనతో ఒక్కముక్క చెప్పండిచాలు. ఆపైన ఆయనే చూసుకుంటారు" అంటూ మా వారి గురించి నాకన్న వాళ్ళకే ఎక్కువ తెలిసినట్లుగా మాట్లాడారు. నేను ఊరికి వెళ్ళిపోయే ముందు వాళ్ళ వాళ్ళ పేర్లూ, ఎడ్రసులూ, ఆ కుర్రవాళ్ళ తాలూకు వివరాలూ అన్నీ కాగితాల మీద రాసిచ్చి "మరిచి పోవద్దండోయ్" అంటూ మరీ మరీ చెప్పారు.

నేను ఊరికి బయలుదేరే ముందు మా అమ్మ కూడా నన్ను చాటుకి పిలిచి, "ఒసే అమ్మాయి, మీ ఆయనతో చెప్పి మన బాబ్జీకేదన్నా చిన్న ఉద్యోగం వేయించమనవే. అతను తలుచుకుంటే ఎంతసేపు!" అంది.

నేను రైల్లో కూర్చున్నాక నాన్నగారు మరోసారి హెచ్చరించారు. "అమ్మాయ్, నేను చెప్పిన సంగతి మరిచిపోయేవు కనుక. మీ ఆయనతో చెప్పి, ఆ కాంట్రాక్టు నెల్లాళ్లలోగా రావాలని, ఆ కన్సర్న్డ్ మినిస్టరుతో ఓ ముక్క మాట్లాడమని చెప్పు. నువ్వు ఏ సంగతీ వెళ్ళగానే ఉత్తరం రాయి" అన్నారు.

నాకు మళ్ళీ పుట్టింటికి వెళ్ళాలంటే భయం పట్టుకుంది. ఇన్ని పనులు నానెత్తిన వేసుకుని తిరిగి రావలసివస్తుందని ఊహించనైనాలేదు. ఏదో పసుపూ కుంకుమా తెచ్చుకుంటాననుకున్నాను గాని, వీళ్లందరి బరువు బాధ్యతలూ తెచ్చి మావారికప్ప గించవలసి వస్తుందనుకోలేదు.

నేను రైలు దిగగానే ఆయనకోసం వెయ్యికళ్ళతో చూశాను ప్లాట్ ఫారమంతా, ఆయన కనిపించకపోయేసరికి నాకు నిస్పృహ కలిగింది. బోలెడంత సామానుతో వచ్చాను. పళ్ళతట్టలూ, ఊరగాయల బుట్టా, కూరలమూటా, కుంపటి, చట్రం, మూకుడూ అవీపెట్టిన బుట్ట ఒకటీ, ట్రంకూ, బెడ్డింగూ, కూజా, కేరేజీ-ఇవన్నీ కిందికి దింపించుకునేసరికి ప్రాణాలు తావుల్ తప్పినట్లయింది. కూలివాడు ఇవతలికి తెచ్చిన సామాను దగ్గర కాపలాగా నేను నుంచుండగా తక్కిన సామాను లోపల్నుంచి అటుఎటైనా పట్టుకు పోతాడేమోనని భయం. ఇటూ అటూ చూడలేక చచ్చాను. మరోకూలీని కూడా పిలిచి సామానంతా వాళ్ళ నెత్తికెక్కించే సరికి నాతల ప్రాణం తోకకొచ్చింది. అంతా అయాక అయ్యగారు ఒగుర్చుకుంటూ వచ్చారు.

"ఇవ్వాళ రైలు తొందరగా వచ్చేసినట్లుందే!" అన్నారు.

"తమరు ఆలస్యంగా వచ్చానని ఒప్పుకోవచ్చుగా" అన్నాను కోపంతో.

నవ్వేసి, 'అదికాదోయ్, పొద్దున్నే ఎయిర్‌పోర్టు కెళ్ళి ఆ హోమ్ మినిస్టర్ని ప్లేనెక్కించి వచ్చేసరికి ఎంత తొందరగా వద్దామన్నా ఆలస్యమయిపోయింది" అన్నారు.

"ఏం! ఆ హోమ్ మినిస్టర్ని మీరు ప్లేనెక్కించటమెందుకు? ఆయనెక్కలేడూ?" అన్నాను వెటకారంగా!

"నీకేం తెలుస్తాయి మగవాళ్ళ వ్యవహారాలు! హోమ్ మినిస్టరంటే అల్లాటప్పా అనుకుంటున్నావు. రేపు ప్రైమ్ మినిస్టరు కూడా అయినా అవుతాడు. మనం కాస్త మంచిగా ఉండొద్దూ!" అన్నారు.

"సరే, పదండి. మీతో మాట్లాడవలసిన వ్యవహారాలు చాలా ఉన్నాయి" అని, కూజా, కేరేజీ చేత పుచ్చుకున్నాను. నా చేతిలోంచి కేరేజీ అందిపుచ్చుకున్నారాయన.

ఇద్దరం ఇల్లు చేరుకున్న తరవాత స్నానాలవీ అయాక, ఇలా భోంచేశారో లేదో అలా బయలుదేరారు.

"మళ్ళీ ఎక్కడకండీ? ఆదివారం పూట! నేనివ్వాళే కదా ఊరు నుంచి వచ్చాను" అన్నాను.

"ఇప్పుడే అరగంటలో వచ్చేస్తాను. ఫైనాన్స్ మినిస్టరు ఇవ్వాళే బొంబాయి నుంచి తిరిగివచ్చాడు. ఆయనతో చాలా పనుంది" అన్నారు.

"మీకెంత సేపూ మంత్రులే గాని పెళ్ళాం అక్కర్లేదు" అన్నాను మూతి ముడుచుకుని.

"ఎందు కక్కర్లేదూ! రాత్రి వస్తా కదా" అన్నారు.

"ఛీ, సిగ్గు లేదు" అన్నాను సిగ్గు పడుతూ.

అరగంటలో వస్తానన్న మనిషి ఆరు గంటలయినా అజా పజా లేదు. చేసిన టిఫిను చల్లారిపోయింది. తీరా వచ్చిన తరువాత టిఫిను పెట్టబోతే, "అక్కడ తినేశాను ఆ మినిస్టరుతో బాటు. మసాలాదోసె" అన్నారు. నాకు ఒళ్ళు మండిపోయింది. ఓ పక్కన నేను ఏమీ తినకుండా ఆయన కోసం ఎదురుచూస్తూ కడుపు మాడి చస్తూంటే మినిస్టరుతో కలిసి మసాలా దోసెలు తినొచ్చారుట. పైగా గొప్పగా చెప్పుకుంటున్నారు.

రాత్రి మంచం మీదికి చేరిన తరవాత, అప్పుడు గుర్తుకొచ్చింది ఆయనకి. నేను పుట్టింటినుంచి ఆ రోజే తిరిగి వచ్చిన సంగతి.

"అన్నట్లు మీ నాన్నగారూ, అమ్మా ఎలా ఉన్నారు? కులాసాయేనా?" అన్నారు.

"మీ దయవల్ల" అన్నాను ముభావంగా. నేను ముక్తసరిగా జవాబు చెప్పేసరికి గ్రహించారు. వ్యవహారం బెడిసి కొట్టేట్టుగా ఉందని. వెంటనే ప్రేమ ఒలక బోస్తూ కబుర్లు మొదలు పెట్టారు. నేను వద్దనుకుంటూనే వళ్లో పడిపోయాను.

పొద్దున్నే లేస్తే మళ్లీ ఆయనకి నా మాట వినిపించుకునే తీరుబడి ఉండదని అప్పటికప్పుడే చెప్పాను నాన్నగారు చెప్పమన్న కాంట్రాక్టు సంగతి.

"సరే, చూస్తానులే" అన్నారు. బ్రతుకు జీవుడా అనుకుని, తక్కిన వ్యవహారాలు కూడా మెల్లిగా కదిపాను. ఆయన వింటూ వింటూ ఛర్రుమని లేచారు.

"ఇప్పుడు వాళ్ళందరికీ ఉద్యోగాలు వేయిస్తానని హామీ ఇచ్చొచ్చావా!" అన్నారు.

"ఎలా ఇస్తానండీ? మిమ్మల్ని ఎలా అయినా ప్రయత్నించి ఉద్యోగాలొచ్చేట్టు చూడమన్నారు. మీకు ఆ మినిస్టర్లూ వాళ్ళూ తెలుసుకదా. మీరొక్కసారి చెబితే అయిపోతుందని వాళ్ళ నమ్మకం" అన్నాను.

"నిన్ను అక్కడికి వెళ్ళి నాకు మినిస్టర్లంతా తెలుసునని గొప్పలు చెప్పమని ఎవడు చెప్పాడు, బుద్ధుండక్కర్లే?" అన్నారు.

నా కళ్ళమ్మట నీళ్ళు తిరిగాయి. ఇందులో నా తప్పేముంది? ఆయన చెప్పిన మాటల బట్టే కదా నేనూ చెప్పాను-ఆయనకి మంత్రులూ వాళ్ళూ తెలుసుననీ, పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసరంటే మినిస్టర్లతో పని అనీను. ఇంకెప్పుడూ అలా గొప్పలు చెప్పకూడదని నిశ్చయించుకున్నాను. చెంపలు కూడా వాయించుకున్నాను బుద్ధిగడ్డితిన్నందుకు.

నేను నోరు మూసుకున్నా పరిస్థితుల్లో ఏం మార్పురాలేదు. ఒక్కసారి మా ఆయన పి.ఆర్.వో. అని తెలియగానే ఆ కీర్తి దావానలంగా వ్యాపించింది. ఆంధ్రదేశమంతటా, ఎక్కడెక్కడి దూరపు చుట్టాలూ ఉత్తరాలు రాసేవారు. "మేం అక్కడికి వస్తున్నాం" అని. మా ఇల్లు వచ్చేపోయే వాళ్ళకి సత్రంలా తయారయింది.

"వాళ్ళని పొమ్మని చెప్పు" అనే వారాయన.

"ఎలా చెప్పను? అంతంత డబ్బులు పోసి ఇంత దూరం వచ్చారు. మీరేదో ఆ మినిస్టరు తోటీ ఈ మినిస్టరుతోటీ చెప్పి పని కానిస్తారని. మీకు చాతనైతే చేసిపెట్టండి. లేకపోతే చెయ్యలేనని ఖచ్చితంగా చెప్పండి" అనేదాన్ని.

చెయ్యలేనని చెప్పటానికి మనసొప్పేది కాదాయనకి. మళ్లీ చెయ్యటానికి ఆయన చేతుల్లో ఏమీ లేదన్నట్లుగా ప్రవర్తించేవారు. నాకీ సంఘర్షణ అర్థంకాదు. 'ఈ బాధలన్నీ ఎందుకు? హాయిగా ఇంకేదైనా ఉద్యోగం చూసుకుందురూ' అని పోరు పెడుతున్నాను ఈ మధ్య."

•••

**ఉపసంహారం**

నవ్వాలో ఏడవాలో తెలియని స్థితిలో ఇంటి ముఖం పట్టాను. ఇంటికి వెళ్ళగానే వదిన అడక్కుండానే చెప్పేశాను. 'లాభం లేదు వదినా. ఏ ఉద్యోగి జీవితం చూసినా ఏదో ఒక లోపం కనిపించక మానటం లేదు. ఆ లోపం ఒక్కటే ఆ భార్య అసంతృప్తికి కారణం అవుతోంది' అన్నాను.

"నేను ముందే చెప్పాను కదా వసంతా! చంద్రుడికి తెలుపు వైపూ నలుపు వైపూ-రెండూ ఉన్నట్లుగా జీవితంలో కూడా సుఖం, దుఃఖం, తృప్తీ, అసంతృప్తీ రెండు ఉంటాయి. ఇది ప్రకృతి సహజం. వెనకటికి బుద్ధుడి దగ్గరికి ఒక తల్లి ఏడుస్తూ వెళ్ళిందట. చచ్చిపోయిన కొడుకుని బ్రతికించమని. చావు సహజమని ఎంత చెప్పినా ఆవిడ నమ్మకపోయేసరికి చావు అనేది సంభవించని ఏదైనా ఒక ఇంటిలోంచి కాసిని నీళ్ళో ఏవో తెమ్మన్నాడుట

బుద్ధుడు. ఆవిడ ఊరంతా తిరిగి తిరిగి చివరికి జ్ఞానోదయమై తిరిగి వచ్చి బుద్ధుడి కాళ్ళమీద పడిందిట!" అని ఉపదేశించింది వదిన.

"పెళ్ళిలో నేనూ నీ కాళ్ల మీద పడతానులే" అన్నాను నవ్వుతూ.

"తథాస్తు!" అంది వదిన బుద్ధుడి పోజుపెట్టి.

నా వరాన్వేషణ పథకాన్ని ప్రస్తుతానికి విరమించుకున్నాను. ఈ సారి అవకాశం వచ్చినప్పుడు - అంటే, నాన్నగారు మళ్ళీ నా పెళ్ళి ప్రసక్తి తీసుకొచ్చినపుడు "మీరే ఏదో ఒకటి చూసి నిశ్చయించండి" అని చెప్పెయ్యాలని నిర్ణయించుకున్నాను. అప్పటినుంచీ మనస్సు మళ్ళీ చదువు మీద నిమగ్నమైంది.

ఓ వారం రోజుల తరువాత రాజు వచ్చాడు. మనిషి చాలా మారిపోయాడు. ఇదివరకు ఇక్కడ ఉంటున్నప్పుడు పీలగా ఉఫ్ అంటే ఎగిరి పోయేట్లుగా ఉండేవాడు. ఇప్పుడు అమెరికాలో ఉండి వచ్చేసరికి బాగా ఒళ్ళొచ్చి ఎర్రగా బుర్రగా సినిమా హీరోలా కనిపిస్తున్నాడు. ఇప్పటి ఫాషన్ ప్రకారం చెంపలు పెంచాడు. నుదురు కొంచెం విశాలమైనట్లుంది. పేరు కూడా కామరాజు అని కాకుండా డా॥ ఎం. కె. రాజు అని పెట్టుకున్నాడు స్టైలిష్‌గా. చూడగానే ఆకర్షణీయంగానే ఉన్నప్పటికీ నాకెందుకో అతనికేసి చూడటానికి మనస్కరించటం లేదు.

అమ్మ, నాన్నగారూ మాత్రం గతమంతా మరిచిపోయినట్టు అతనితో ఆప్యాయంగా మాట్లాడుతున్నారు. రాజు నాన్నగారి కోసం ఎలెక్ట్రిక్ షేవరూ, వాతావరణం సూచించేమీటరూ తెచ్చిపెట్టాడు. అన్నయ్యకి షర్టులూ టైలూ తెచ్చాడు. అమ్మకోసం ఎలెక్ట్రిక్ రైస్ కుక్కరూ, అంటుకోకుండా మాడకుండా అట్లువేసే పెనం, మిక్సరూ-ఇలాంటి సామాన్లన్నీ తెచ్చాడు. అమ్మ సంతోషంగా పొంగిపోయింది. రాజు కిష్టమైన కంది పచ్చడీ, పెరుగువడలూ, కారబ్బూందీ-మొదలైనవన్నీ అడిగి అడిగి మరీ చేసిపెడుతోంది. నాన్నగారు కూడా సొంత కొడుకుతో మట్లాడినంత ఆప్యాయంగా మాట్లాడుతున్నారు. వాళ్ళు అంత త్వరగా జరిగిందంతా ఎలామరిచిపోగలిగారోనని నాకు ఆశ్చర్యం వేసింది.

రాజు వచ్చిన నాలుగురోజులికి అక్క పురిటికి వచ్చింది. గుమ్మంలో కనిపించిన రాజుని చూసి క్షణంసేపు గుర్తుపట్టలేక పోయినట్లు తెల్లబోయి చూసింది, రాజే పలకరించాడు "ఏం, కమలా, మరిచిపోయావా?" అంటూ.

"ఓ రాజూ, నువ్వా! చాలా మారిపోయావుస్మీ! ఎప్పుడొచ్చావు అమెరికానుంచి?" అంది నిర్మలంగా నవ్వుతూ.

అక్కయ్య నెలలునిండి నిండుగా హుందాగా కనిపిస్తోంది. ఆ స్థితిలో రాజుకన్న వెయ్యిరెట్లు ఉన్నతంగా ఉన్నట్లు తోచింది నాకు.

లోపలికొచ్చి కూర్చుని కాఫీ తాగుతూ అక్కయ్య, రాజూ ఒకటే కబుర్లు–చిన్ననాటి నేస్తాల్లా! అక్కనిచూస్తే నాకు మరింత ఆశ్చర్యం వేసింది. తనను పెళ్లిచేసుకోవటానికి నిరాకరించిన రాజుతో అంత నిర్మలంగా హాయిగా ఎలా మాట్లాడగలుగుతోంది? రాజు చేసుకోనన్నాడని చెప్పి ఆ రాత్రి డాబామీద ఏడ్చిన అక్కయ్యేనా! నన్ను కూడా చేసుకోవద్దని బతిమాలుతున్నట్లు బాధగా మాట్లాడిన అక్కయ్యేనా! పెళ్ళయాక ఈ ఆడవాళ్ళెలా మారిపోతారో అర్థంకాదు.

అక్కవచ్చాక రాజుకి పగలంతా బాగా కాలక్షేపం అవుతోంది. నేను మాత్రం ముభావంగానే ఉంటూ వచ్చాను. అతను ఉన్నప్పుడు అక్కతోకూడా సరిగ్గా మాట్లాడబుద్ధేసేది కాదు నాకు. నాగదిలోకి పోయి చదువుకుంటూ కూర్చునేదాన్ని.

ఆ రోజు పొద్దున్న ఆదివారం కదా అని బద్ధకంగా పక్క మీద దొర్లుతున్నాను. అక్కయ్య వచ్చి నా పక్కమీద కూర్చుని నా నడుంమీద చెయ్యేసింది.

"రావే, నువ్వు కూడా పడుకో" అన్నాను సరదాగా.

"వసంతా, నీతో ఓ సంగతి మాట్లాడాలే" అంది. ఏమిటన్నట్లు చూశాను.

"నిన్నో ప్రశ్న అడగనా?" అంది.

"అడగవే, సందేహిస్తావెందుకు?" అన్నాను.

"రాజుతో అంత ముభావంగా ఉంటున్నావెందుకు?" అంది.

"ఏమో, అతనితో అంతగా మాట్లాడాలనిపించటంలేదు" అన్నాను.

"నువ్వు 'ఊఁ' అంటే చాలు, అమ్మ, నాన్నగారూ ముహూర్తం పెట్టించాలని ఎదురు చూస్తున్నారు" అంది అక్క

"నాకు నచ్చిన సంబంధం రావద్దూ! ఊఁఅంటే సరిపోతుందేమిటి?" అన్నాను నవ్వుతూ.

"అదేమిటే మరీను! రాజుకంటే మంచివాడు ఎక్కడ దొరుకుతాడు?" అంది.

"రాజా! నీ కేమన్నా మతి పోయిందా?" అన్నాను.

"ఏం, మతి పోవటానికేమైందని? రాజు మన మేనత్త కొడుకు. డాక్టరేట్ సంపాదించాడు. అమెరికాలో ఉద్యోగం. అంతకన్న మంచి సంబంధం ఎలా వస్తుందే?

అతనింకా పెళ్ళిచేసుకోకుండా ఇక్కడికి నీ కోసం రావటం నీ అదృష్టంకాదుటే!' అంది.

నేను నిర్ఘాంతపోయాను దాని ధోరణికి.

"ఆ రాత్రి డాబామీద మన సంభాషణ మరిచి పోయావా అక్కా? అతన్ని ఛస్తే చేసుకోనని నీకు మాటివ్వలేదూ? నన్ను పరీక్షిస్తున్నావా?" అన్నాను బాధగా.

"అయ్యో, పిచ్చిదానా! నువ్వింకా అదే మనస్సులో పెట్టుకు బాధపడుతున్నావా! అప్పుడేదో తాత్కాలికంగా మనస్సు గాయపడి ఆ బాధలో ఏదో అన్నాను. ఆ సంగతి ఎప్పుడో మరిచిపోయాన్నేను. నాకు నిక్షేపంలా పెళ్ళయింది. పిల్లతల్లిని కూడా కాబోతున్నాను. నాకేం లోటే! అసలు రాజు నన్ను ఒప్పుకోక పోవటమే మంచిదయింది. మాకిద్దరికీ పెళ్ళయితే ఎంత వరహీనంగా ఉండేదో! అతన్నిప్పుడు చూస్తే మా మరిదిని చూసినట్లుగా అనిపిస్తోంది మీ కిద్దరికీ ఈడూ జోడూ ఎంచక్కా ఉంది. అట్టే వెర్రి మొర్రి ఆలోచనలు పెట్టుకోక ఒప్పుకో" అంది.

"అయితే అక్కా మీ ఆయన ఉద్యోగం గురించి ఎప్పుడూ కంప్లెయిన్ చేస్తూండేదానివి కదా. ఇప్పుడు అంత సుఖంగా ఉన్నట్లు ఎలా మాట్లాడగలుగుతున్నావ్" అన్నాను.

అక్క నవ్వింది.

"మధ్య మధ్య ఎప్పుడైనా ఒళ్ళుమండి ఏదో అనుకుంటూ ఉంటాం. అంత మాత్రానికి ప్రేమలెక్కడికి పోతాయే!" అంది.

ఈ పెళ్ళయిన వాళ్ళని అర్థం చేసుకోవటం కష్టంబాబూ అనుకున్నాను.

ఆ రోజు ఎక్కడికీ వెళ్ళకుండా ఇంట్లోనే గడిపాను అక్కతో కబుర్లు చెబుతూ. రాజు ఎక్కడికి వెళ్ళాడో తెలియదు. రోజంతా కనిపించలేదు. భోజనానికయ్యూడా రాలేదు మధ్యాహ్నం. ఏ స్నేహితులింటికో వెళ్ళినట్లున్నాడు.

ఆ రాత్రి నా గదిలో కూర్చుని చదువుకుంటున్నాను దగ్గరగా వేసి ఉన్న తలుపులు తెరుచుకున్నాయి హఠాత్తుగా. తలెత్తిచూసి ఉలిక్కిపడ్డాను. ఆ సమయంలో రాజు నా గదిలోకి వస్తాడని ఊహించలేదు. నలుగురిలోఉన్నప్పుడే అంతగా మాట్లాడుకోవటం లేదు. ఒంటరిగా ఉండగా గదిలోకి వస్తాడని ఎలా అనుకుంటాను?

"కూర్చోవచ్చా?" అన్నాడు చిరునవ్వుతో.

"కూర్చో రాజూ" అన్నాను ఎదురుగా ఉన్న కుర్చీకేసి చూస్తూ.

కూర్చుని, "దు యూ మైండ్?" అన్నాడు సిగరెట్‌పెట్టి, లైటరూ తీసి. బుర్ర ఊపాను అడ్డంగా.

సిగరెట్ తీసి పెదిమల మధ్య పెట్టుకుని వెలిగించుకున్నాడు. అతను నాకేసి ప్రత్యేకంగా చూస్తూంటే నేను పుస్తకం వైపు చూడలేకపోయాను. ఊరికే అతని ముఖం చూడటం ఇబ్బందిగా అనిపించి సంభాషణ మొదలుపెట్టాను.

"ఏం ఉద్యోగం చేస్తున్నావ్ అమెరికాలో?" అన్నాను.

"హమ్మయ్య! నా మీద ఆ మాత్రం కుతూహలం ఉంది అంతే చాలు!" అన్నాడు.

"చెప్పు, ఏం ఉద్యోగం?" అన్నాను చిరునవ్వునవ్వి.

"ల్యూనార్ సైన్స్ ఇన్‌స్టిట్యూట్‌లో అసిస్టెంట్ సైంటిస్ట్‌ని" అన్నాడు.

"ఓ! అయితే మూన్ మీదికెప్పుడు వెడుతున్నావ్?" అన్నాను నవ్వుతూ.

"మూన్ దాకా వెళ్ళటానికి ఇంకా కొంత టైము పట్టొచ్చు. అందాకా నువ్వు వస్తానంటే హనీమూన్‌కి తీసికెడతాను" అన్నాడు కొంటెగా నవ్వుతూ.

ఎదురు చూడని ఆ మాటలికి సిగ్గుపడి తలవంచుకున్నాను.

అతను సిగరెట్ కింద పడేసి, నలిపి, లేచి నుంచున్నాడు.

వెళ్ళిపోతాడు కదా, బ్రతుకు జీవుడా అనుకున్నాను.

కానీ, అతను నా కుర్చీ వెనకాతలకొచ్చి నిలబడ్డాడు. నా కర్థం కాలేదు.

హఠాత్తుగా అతను వంచివున్న నా ముఖాన్ని పైకెత్తి దోసెట్లో పెట్టుకుని నా కన్నుల్లోకి చూస్తూ కిందికి వంచాడు తన తల.

సిగ్గుతో నా కనురెప్పలు మూతలు పడిపోయాయి.

*(జ్యోతి, మే, జూన్, జూలై, ఆగస్టు 1975)*